# విశాల భారతి
తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్ 05.04.2025 | 24 క్యారెట్లు 93,215.00 | కిలో వెండి 1,12,000.00 | 32 °C | సంపుటి:3 | సంచిక:164

www.vishalabharati.com


## కొత్త సీఎస్‌గా రామకృష్ణారావు..?

- సీఎస్ శాంతి కుమారి రాజీనామా..?
- ఆర్టీఐ చీఫ్‌గా పంపే అవకాశాలు
- పోటీలో మరికొందరు సీనియర్‌ఐఏఎస్‌లు
- నేడు త్రిసభ్య కమిటీ సమావేశంలో క్లారిటీ



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కే.రామకృష్ణారావు నియమితులుకానున్నారు. 1990 బ్యాచ్ ఐఏఎస్‌కు చెందిన రామకృష్ణారావు తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ఆర్థిక శాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రామకృష్ణారావు వచ్చే ఆగస్టులో రిటైర్ కానున్నారు. ప్రస్తుతమున్న ఐఏఎస్‌ల్లో శశాంక్‌గోయల్ తరువాత సీనియర్‌గా రామకృష్ణారావు ఉన్నారు. ఆర్థిక శాఖలో ఆయన చేసిన సేవలు, ఆర్థికంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపించడంలో ఆయనకున్న అనుభవం

..మిగతా 2 లో



## రాష్ట్ర బీజేపీలో విభేదాలు

- హైదరాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వంపై రచ్చ
- మేకప్ మేన్లు, టేబుళ్లు తుడిచేటోళ్లకు టికెట్లా..?
- సీనియర్ నేతలు, కార్యకర్తలకు అన్యాయం
- కీలక పోస్టులన్నీ సికింద్రాబాద్ నేతలకేనా..?
- నాకు పోటీగా శ్రీరామనవమి శోభాయాత్ర చేస్తారా..?
- మీ అయ్యలు ప్రయత్నించినా నన్ను ఆపలేరు
- కిషన్ రెడ్డిపై ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ బీజేపీలో మరోసారి విభేదాలు మొదలయ్యాయి. కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి టార్గెట్‌గా ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గౌతమ్ రావును ప్రకటించడంపై రాజాసింగ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మీకు గులాంగిరి చేసేవాళ్లకే పోస్టులు, టికెట్లు ఇస్తారా అంటూ ఫైర్ అయ్యారు. మేకప్ మేన్‌లు, టేబుల్ తుడిచేవాళ్లకే పెద్ద పోస్టులు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో నిజమైన కార్యకర్తలకు, సీనియర్ నేతలకు అన్యాయం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కీలక పోస్టులన్నీ ఒక్క పార్లమెంట్ పరిధిలోని

..మిగతా 2 లో



# మన చదువులు మారాలి

- మెరుగైన విద్యావ్యవస్థకు పాలసీ
- ఆ దిశగా ఆచరణాత్మక విధానపత్రం రూపొందించాలి
- అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల స్థాయిలో మార్పులు
- భాష, విషయ పరిజ్ఞానం రెండూ ప్రధానమే
- ఎంత వ్యయమైనా వెనుకాడేది లేదు
- రూట్ మ్యాప్ రెడీ చేయండి
- విద్యా కమిషన్‌కు సీఎం రేవంత్ ఆదేశాలు

విశాలభారతతి, స్టేట్ బ్యూరో:

రాష్ట్రంలో విద్యావ్యవస్థ మెరుగుపడేలా పాలసీ తయారు చేయాలని విద్యా కమిషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా ఆచరణ సాధ్యంగా పాలసీ ఉండాలని స్పష్టం చేశారు. జీవన ప్రమాణాలు పెంచేలా విద్యా విధానం ఉండాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఉత్తమ విద్యా వ్యవస్థ ఏర్పాటు కోసం ఎంత ఖర్చయినా వెనుకాడబోమని సీఎం అన్నారు. విద్యా వ్యవస్థలో లోపాలు, చేపట్టాల్సిన సంస్కరణలపై బంజారాహిల్‌స్‌లోని కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో విద్యాకమిషన్, విద్యా శాఖ అధికారులు, నిపుణులతో సీఎం చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

..మిగతా 2 లో

## బనకచర్లపై సుప్రీంకోర్టుకు వెళతాం

- రాయలసీమ ఎత్తిపోతలపైనా కేసు వేస్తాం
- ఏపీ అక్రమ ప్రాజెక్టులపై చూస్తూ ఊరుకోం
- బీఆర్ఎస్ ఉదాసీనత వల్లే ఈ దుస్థితి
- భారీగా గోదావరి నీటిని తరలిస్తే భద్రాచలానికి ముంపు ముప్పు
- జలసౌధలో అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష
- సన్నబియ్యం పంపిణీ చారిత్రాత్మక నిర్ణయమని ప్రకటన



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఏపీ ప్రభుత్వం నిర్మిస్తోన్న ప్రాజెక్టులపై తెలంగాణ ఇరిగేషన్ మినిస్టర్ ఉత్తమ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీ ప్రభుత్వం చేపడుతోన్న ప్రాజెక్టులపై సుప్రీంకోర్టుకు వెళ్తామని

..మిగతా 2 లో



గ్రూప్1 నియామకాలకు

## లైన్ క్లియర్..

- సుప్రీంకోర్టు కీలక తీర్పు
- జీవో 29పై దాఖలైన పిటిషన్లు కొట్టివేత

..మిగతా 2 లో



## ఉద్యోగాలిస్తేనే రాష్ట్ర ఏర్పాటుకు సార్థకత

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం
- చదువుకున్న ప్రతి బిడ్డకు ఉపాధి అవకాశాలు..
- రూ.9వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం అమలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- 112 మంది 'యాదాద్రి' నిర్వాసితులు, 51మంది డీఏవోలకు నియామక పత్రాలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

యువతకు ఉద్యోగాలు ఇస్తేనే... తెలంగాణ ఏర్పాటుకు సార్థకత, అర్థం, పరమార్థం ఉంటుందన్న ఆలోచనతో ప్రజాప్రభుత్వం ముందుకెళ్తోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. చదువుకున్న ప్రతి బిడ్డకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాలన్నదే తమ అభిమతమని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందకూడదని ఆశించే వారి పట్ల యువత

..మిగతా 3 లో



## ఒక్కరోజే 9.5 లక్షల కోట్లు లాస్

- ట్రంప్ దెబ్బకు కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు
- సెన్సెక్స్ 930 పాయింట్లు పతనం
- 76,000 స్థాయిని కోల్పోయిన సూచీ

..మిగతా 2 లో

# కాంగ్రెస్ సర్కారు జోలికెళ్లం

- రాష్ట్రంలో మూడేళ్లు వాళ్లదే అధికారం
- ఎవడో భిక్ష వేస్తే నేను సీఎం సీట్లో కూర్చోను
- వచ్చే ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తాం
- పార్టీ నుంచి వెళ్లిపోయిన వారిని తిరిగి చేర్చుకోం
- బీఆర్ఎస్‌అధినేత, మాజీ సీఎం కేసీఆర్
- హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా నేతలతో భేటీ



విశాలభారతి, స్టేట్‌బ్యూరో:

'వాడు వీడు భిక్ష వేస్తే తాను సీఎం సీట్లో కూర్చోను. వచ్చే మూడేళ్లూ కాంగ్రెస్ పార్టీనే అధికారంలో కొనసాగుతుంది. ప్రభుత్వాన్ని కూల్చే పిచ్చిపిచ్చి పనులు మేం చేయబోం' అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పారు. శుక్రవారం ఎర్రవెల్లిలోని ఫాంహౌజ్‌లో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ నేపథ్యంలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల పార్టీ ముఖ్య నేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మధ్యలో వచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని చెప్పినా తాము ఆ పనికి ఒప్పుకోబోమని అన్నారు. అలా మధ్యలో తాము అధికారాన్ని తీసుకోబోమని అన్నారు. జనరల్ ఎన్నికల్లోనే తేల్చుకుంటామని.. మళ్లీ తామే బీఆర్ఎస్ పార్టీ గెలిచి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటామని అన్నారు.


**కొత్త లీడర్లకు అవకాశాలు..**

పార్టీని వీడిన వారిని తిరిగి పార్టీలోకి చేర్చుకోమని కేసీఆర్ స్పష్టం చేశారు. పార్టీ నుంచి పోయిన వారు వస్తామంటే తీసుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తమకే చాలా మంది లీడర్లు ఉన్నారని.. వారికే


..మిగతా 2 లో

## కాంగ్రెస్, బీఆర్ఎస్‌ది ఫెవికాల్ బంధం

- మొన్న డీలిమిటేషన్ పేరుతో ఒక్కటయ్యారు
- నిన్న వక్ఫ్ బోర్డు బిల్లుపై కేంద్రానికి వ్యతిరేకంగా ఓటేశారు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం



..మిగతా 3 లో



## దిగొచ్చిన బంగారం ధరలు

- ఒక్కరోజే రూ.1,600 పతనం
- పదిగ్రాముల బంగారం రూ.91,640

..మిగతా 2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
05.04.2025
హైదరాబాద్
epaper:vishalabharathi.com
www.vishalabharati.com



## దేశభక్తి చిత్రాలకు పెట్టింది పేరు

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

బాలీవుడ్ సీనియర్ నటుడు, దర్శకుడు మనోజ్‌కుమార్ కన్నుమూశారు. ఆయన వయసు 87 సంవత్సరాలు. ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణానికి గల కారణం తెలియరాలేదు. మనోజ్ కుమార్ పలు విజయవంతమైన సినిమాల్లో నటించారు. 'పూరబ్ ఔర్ పాచిమ్', 'క్రాంతి', 'రోటీ, కపడా ఔర్ మకాన్' వంటి సినిమాలు ఆయనకు విశేషమైన గుర్తింపును తెచ్చిపెట్టాయి. దేశభక్తి చిత్రాల్లో ఎక్కువగా నటించడంతో ఆయనను 'భారత్ కుమార్' అని పిలుచుకునేవారు. ఒక జాతీయ చలనచిత్ర అవార్డు, ఏడు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. నటుడిగానే కాకుండా దర్శకుడిగా, స్క్రీన్ రైటర్‌గా, పాటల రచయితగా, ఎడిటర్‌గా భిన్న పార్శ్వాలు కలిగిన వ్యక్తిగా మనోజ్ కుమార్ పేరు సంపాదించుకున్నారు. 1992లో భారత ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. అలాగే, 2015లో 'దాదాసాహెబ్ ఫాల్కే' అవార్డును అందుకున్నారు.

# బనకచర్లపై సుప్రీంకోర్టుకు వెళతాం

మొదటి పేజీ తరువాయి



అన్నారు. రాయలసీమ ఎత్తిపోతల, బనకచర్ల ప్రాజెక్టుల నిర్మాణంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామన్నారు. రాయలసీమ ఎత్తిపోతల, బనకచర్ల ప్రాజెక్టులతో తెలంగాణకు నష్టం జరుగుతుందని.. ఈ ప్రాజెక్టుల వల్ల తెలంగాణలో సాగు, తాగు నీటికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని అన్నారు. గోదావరి ట్రైబ్యునల్ ఉత్తర్వులు, విభజన చట్టాన్ని ఏపీ ఉల్లంఘిస్తోందని.. కేంద్ర ప్రభుత్వం, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండానే ప్రాజెక్టులు చేపడుతున్నారని ఆరోపించారు. నదీ యాజమాన్య బోర్డుల పర్మిషన్ లేకుండానే ప్రాజెక్టులు చేపడుతున్నారని అన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై ఇప్పటికే అభ్యంతరం తెలిపామని.. ఏపీ ప్రభుత్వం పర్యావరణ నిబంధనలు ఉల్లంఘిస్తోందని కేంద్ర నిపుణుల కమిటీ కూడా చెప్పిందని పేర్కొన్నారు.

అయినప్పటికీ ఏపీ పరోక్ష మార్గాల్లో ప్రాజెక్టు నిర్మాణాన్ని కొనసాగిస్తోందన్నారు. ఏపీ ప్రభుత్వ చర్యలను తెలంగాణ ప్రభుత్వం చూస్తూ ఉరుకోదని తేల్చిచెప్పారు. ఏపీ సర్కార్ ఏకపక్షంగా నిర్మించ తలపెట్టిన ఈ ప్రాజెక్టులపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. కాగా, బనకచర్ల ప్రాజెక్టును వేగంగా నిర్మించాలని ఏపీ కేబినెట్ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏపీ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు.సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మక నిర్ణయంసన్నబియ్యం పంపిణీ ఒక చరిత్రాత్మక నిర్ణయమని ఉత్తమ్ కుమార్ రెడ్డి అభివర్ణించారు. ఈ పథకానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఆయన అన్నారు. దాదాపు 80 శాతం మంది పేదలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారుల ఇళ్లలో ప్రజాప్రతినిధులు భోజనం చేయాలని ఆయన సూచించారు. శ్రీరామ నవమి రోజున భద్రాచలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక లబ్ధిదారుడి నివాసంలో భోజనం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. సన్నబియ్యం పంపిణీలో అవకతవకలకు ఏమాత్రం ఆస్కారం ఉండకూడదని ఆయన అధికారులను ఆదేశించారు.



# కాంగ్రెస్ సర్కారు జోలికెళ్లం

మొదటి పేజీ తరువాయి

అవకాశాలు ఇస్తామని చెప్పారు. కొత్త వారిని తయారుచేసుకుందామని అన్నారు. రాష్ట్రంలో పలు సీట్లకు ఉప ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ గెలుపొందడం ఖాయమన్నారు. అలాగే.. మనకు బీజేపీ, కాంగ్రెస్ ఎవరూ పోటీకాదన్నారు. కాంగ్రెస్ పాలనను అనుభవిస్తున్న ప్రజలు పదేళ్ల దాంక మళ్లీ దానికి ఓట్లు కూడా వేయరన్నారు. వ్యవసాయం, నీరు, కరెంటుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అందుకే ప్రజలు ఎన్నికల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారని.. ఎప్పుడెప్పుడు ఎన్నికలు వస్తాయా.. ఎప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పీడ పోతుందా అని చూస్తున్నారని అన్నారు. మళ్లీ వారు బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని చెప్పారు.

**దేశవ్యాప్తంగా మోడీపై వ్యతిరేకత..**

దేశంలో మూడో సారి ప్రధానిగా అధికారం చేపట్టిన మోడీకి బాగా గర్వం పెరిగిందని కేసీఆర్ అన్నారు. తనకు తానే మేధావిని అని అనుకుంటున్నారని.. చివరకు ఆర్ఎస్ఎస్ కంటే తానే గొప్ప అనే భావనతో ఉన్నారని కేసీఆర్ చెప్పారు. ఈ విషయాన్ని ఆర్ఎస్ఎస్ సైతం గుర్తించిందని, ఆయన మీద తీవ్ర వ్యతిరేకతతో ఉన్నదని అన్నారు. ఇటు దేశవ్యాప్తంగానూ మోడీపై వ్యతిరేకత వచ్చిందన్నారు. మోడీ అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ అయ్యారని చెప్పారు. ఇక దేశంలో, రాష్ట్రంలో బీజేపీ పని అయిపోయినట్లేనని జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్ రావు, వాణి దేవి, దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు, మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, బండారి లక్ష్మారెడ్డి, డి.సుధీర్ రెడ్డి, ముఠా గోపాల్, మర్రి రాజశేఖర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్‌రెడ్డి, డా.మెతుకు ఆనంద్, పైలట్ రోహిత్ రెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, నాయకులు పటోళ్ల కార్తీక్ రెడ్డి, మన్నె గోవర్ధన్ రెడ్డి, జయసింహ, మన్నె క్రిశాంక్, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి, కల్వకుంట్ల వంశీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.



# గ్రూప్1 నియామకాలకు లైన్ క్లియర్..

- **సుప్రీంకోర్టు కీలక తీర్పు**
- **జీవో 29పై దాఖలైన పిటిషన్లు కొట్టివేత**
- **సర్టిఫికేట్ల వెరిఫికేషన్‌కు టీజీపీఎస్సీ ఏర్పాట్లు**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ గ్రూప్1 ఉద్యోగ నియామకాలకు లైన్ క్లియర్ అయింది. జీవో నెం.29ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టేందుకు టీజీపీఎస్సీ సన్నాహకాలు మొదలుపెట్టింది. మొత్తం 563 గ్రూప్1 పోస్టుల భర్తీ కోసం 2024 ఫిబ్రవరిలో టీజీపీఎస్సీ(TGPSC) నోటిఫికేషన్ విడుదల చేసింది. జూన్, 2024లో ప్రిలిమినరీ పరీక్ష జరగగా అక్టోబర్‌లో మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. ఫలితాలు 2025 మార్చి 10న ప్రకటించారు. మార్చి 30న జనరల్ ర్యాంక్స్ విడుదల చేశారు. కానీ ఈ నోటిఫికేషన్‌లో జీవో నెం.29 ద్వారా తమకు అన్యాయం జరుగుతోందని కొంతమంది అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు వారి పిటిషన్‌ను కొట్టివేసింది. బలమైన వాదనలు లేవని తోసిపుచ్చింది.

# మన చదువులు మారాలి

మొదటి పేజీ తరువాయి



తెలిపారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తే ఉన్నత చదువుల్లో విద్యార్థులు మరింత రాణించగలరన్నారు. అంగన్‌వాడీలు, ప్రాథమిక పాఠశాల స్థాయిలో తీసుకురావల్సిన మార్పులపై మేధావులు, నిపుణులతో చర్చించి మెరుగైన పాలసీ రూపొందించాలని సీఎం సూచించారు. వనరులను సద్వినియోగం చేసుకొని విద్యా వ్యవస్థలో రాష్ట్రాన్ని అగ్రగామిలా నిలిపేలా సూచనలు తీసుకోవాలన్నారు.ఇతర దేశాలు, రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను విద్యాకమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పరీక్షల విధానం, బోధన ప్రమాణాలు, పాఠశాలల తనిఖీలపై మాజీ ఐఏఎస్ అధికారి, ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పలు సూచనలు ఇచ్చారు. సమీక్షలో సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, కేశవరావు, శ్రీనివాసరాజు, ఉన్నతాధికారులు మాణిక్ రాజ్, వేముల శ్రీనివాసులు, యోగితా రాణా, నరసింహారెడ్డి, విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్‌రావు, చారకొండ వెంకటేష్, కె. జ్యోత్స్న శివారెడ్డి, పలు ఎన్జీవోల ప్రతినిధులు పాల్గొన్నారు.మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులకు విశ్వవిద్యాలయాలు ప్రాధాన్యం ఇవ్వాలని వీసీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో సమస్యలపై వైస్‌ఛాన్సలర్లతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. ప్రాధాన్యత లేని కోర్సులను రద్దు చేసి కొత్తవి ప్రవేశపెట్టాలని సీఎం సూచించారు. రద్దు చేసిన విభాగాల ప్రొఫెసర్లకు పరిపాలన బాధ్యతలు అప్పగించాలన్నారు. ప్రొఫెసర్లకు పునరావాస కేంద్రాలుగా యూనివర్సిటీలను మార్చవద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గ్రామీణ పేద, మధ్యతరగతి విద్యార్థులకు భవిష్యత్తు కల్పించేలా యూనివర్సిటీల్లో బోధన ఉండాలని సీఎం తెలిపారు.యూనివర్సిటీల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అవసరమైన నిధులు, భవనాలు, నియామకాలపై నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులే కేంద్రంగా యూనివర్సిటీలు పనిచేయాలన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం లోగోను సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు.

# కొత్త సీఎస్‌గా రామకృష్ణారావు..?

మొదటి పేజీ తరువాయి



తొద్పడుతుందని ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఆయనను సీఎస్‌గా నియమించాలనే ఆలోచన చేసినట్లుగా సమాచారం.

రామకృష్ణారావు గతంలో నల్గొండ జాయింట్ కలెక్టర్‌గా, గుంటూరు కలెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుత సీఎస్‌శాంతి కుమారి తన సర్వీసుకు వీఆర్ఎస్ తీసుకోవాలనే యోచనలో ఉన్నట్లుగా తెలిసింది. ఆమె వీఆర్ఎస్‌నిర్ణయాన్ని వచ్చేవారం ప్రకటించనున్నట్లుగా సమాచారం. దీంతో కొత్త సీఎస్‌గా రామకృష్ణారావును నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లుగా సమాచారం. వాస్తవంగా శాంతి కుమారి ఈనెలఖరున పదవీ విరమణ చేయనున్నారు. అంత కంటే ముందుగానే ఆమె వీఆర్ఎస్‌తీసుకోవాలని ఆలోచన చేస్తున్నట్లుగా తెలిసింది.

1989 బ్యాచ్ ఐఏఎస్‌కు చెందిన శాంతి కుమారి 2023 జనవరి 11వ తేదీ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. అప్పటి వరకు సీఎస్‌గా ఉన్న సోమేశ్ కుమార్ ఏపీకి అలాట్ కావడంతో ఆమె సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించారు. వీఆర్ఎస్ తరువాత శాంతి కుమారి ని చీఫ్ఇన్ఫర్మేషన్‌కమిషనర్‌గా నియమించనున్నట్లుగా సమాచారం. ఆమె నియామకం ఇప్పటికే ఖరారు అయిందని, కేవలం అధికారిక ప్రక్రియ మాత్రమే జరగాల్సి ఉందని తెలిసింది. వచ్చే వారం సమాచార కమిషనర్‌లకు సంబంధించిన నియామక సమావేశం జరగనున్నట్లుగా తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో ఆమెతో పాటు మరికొందరు సమాచార కమిషనర్‌లుగా నియమించనున్నట్లుగా తెలిసింది. గత కొన్నాళ్లుగా ఖాళీగాఉన్న సమాచార కమిషనర్‌ల పోస్టులు భర్తీ కానున్నాయి.





# రాష్ట్ర బీజేపీలో విభేదాలు

మొదటి పేజీ తరువాయి

నాయకులకే వస్తున్నాయని అక్కసు వెళ్లగక్కారు. మిగతా పార్లమెంట్లలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు లేరా? అంటూ నిలదీశారు. సీనియర్ నేతలను పక్కకు నెట్టేస్తున్నారని అసహనం వ్యక్తం చేసిన రాజాసింగ్.. తమను గులాంగిరీలా చూడొద్దని హెచ్చరించారు. తనను అడ్డుకోవడానికే గౌతమ్ రావుకు ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చారని రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. "హిందువులంతా ఒక్కటిగా రామరాజ్యం రావాలనే లక్ష్యంతో నేను శ్రీరామనవమి శోభాయాత్ర తీయబోతున్నాను. కానీ, నాపై ఎన్నో కేసులు పెట్టారు. అయినా, నేను భయపడేది లేదు. నా శోభాయాత్రను బలహీనపరిచేందుకు గౌతమ్ రావు మరో యాత్ర చేస్తున్నారు. అందుకే ఆయనకు టికెట్ ఇచ్చారు. మీరు కాదు, మీ అయ్యలు వచ్చినా కూడా నా రామభక్తుల్ని ఆపలేరు" అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు పోటీగా అంబర్‌పేట్ నుంచి గౌతమ్ రావు శ్రీరామనవమి శోభాయాత్ర చేస్తున్నారని ఫైర్ అయ్యారు.ఇటీవల బీజేపీ కొత్త అధ్యక్షుడి నియామకంపై సైతం రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిని స్టేట్ కమిటీ డిసైడ్ చేస్తే రబ్బర్ స్టాంప్‌గా ఉంటాడంటూ కామెంట్స్ చేశారు. సెంట్రల్ కమిటీ తెలంగాణ బీజేపీ అధ్యక్షుని డిసైడ్ చేస్తే బాగుంటుందన్నారు. గతంలో ఎవరు అధ్యక్షుడు అయితే వారు గ్రూప్ తయారు చేసుకొని పార్టీకి నష్టం చేశారని ఆరోపించారు. పార్టీలో పాత సామాను ఎక్కువైపోయిందని.. వాళ్లను పంపించేయాలని కీలక ఆరోపణలు గుప్పించారు. పార్టీలో తనపై వేధింపులు ఎక్కువవుతున్నాయని.. తట్టుకోలేకపోతున్నాని.. పొమ్మంటే పార్టీని వదిలేయటానికి తాను సిద్ధమంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. మరోవైపు.. పార్టీలో అవుట్ డేటెడ్ నాయకులు చాలా మంది ఉన్నారని వారికి రిటైర్మెంట్ ఇచ్చేయాలంటూ సంచలన లేఖ రాశారు. అయితే అప్పటి నుంచి రాజాసింగ్ మీద బీజేపీ నాయకత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మరి.. ఇప్పుడు కూడా బహిరంగంగానే సంచలన ఆరోపణలు చేయటంతో.. బీజేపీ నాయకత్వం ఎలా స్పందిస్తుందన్నది చర్చనీయాంశంగా మారింది.

# ఒక్కరోజే 9.5 లక్షల కోట్లు లాస్

- **ట్రంప్ దెబ్బకు కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు**
- **సెన్సెక్స్ 930 పాయింట్లు పతనం**
- **76,000 స్థాయిని కోల్పోయిన సూచీ**
- **23,000 దిగువకు జారిన నిఫ్టీ**



**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాల్లో ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ప్రకటించిన రెసిప్రోకల్ టారిఫ్‌లు గ్లోబల్ మార్కెట్లను షేక్ చేశాయి. మదుపర్లు భారీగా విక్రయాలు జరపడంతో సూచీలు తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 930 పాయింట్లు పడిపోయింది. 75,364 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 345 పాయింట్లు క్షీణించింది. 22,904 వద్ద సెటిల్ అయింది. మళ్లీ 23 వేల దిగువకు చేరింది. ఈరోజు అన్ని సెక్టార్ల సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. ముఖ్యంగా మెటల్, ఫార్మా, ఐటీ స్టాక్స్ ఎక్కువగా నష్టపోయాయి. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఈ ఒక్క సెషన్ లోనే రూ. 9.5 లక్షల కోట్లు తగ్గి రూ. 403.83 లక్షల కోట్లకు పడిపోయింది. ఈరోజు మార్కెట్లు భారీగా నష్టపోవడానికి ముఖ్యంగా నాలుగు ప్రధాన కారణాలున్నాయని అనలిస్టులు చెబుతున్నారు.

**ట్రంప్ టారిఫ్‌లు ఇవే..**

డొనాల్డ్ ట్రంప్ అమెరికా దిగుమతి చేసుకునే వస్తువులపై కనీసం 10 శాతం సుంకాలు విధిస్తున్నట్లు గురువారం ప్రకటించారు. దీనికి అధనంగా కొన్ని దేశాలపై సుంకాలు పెంచారు. భారత్ పై 26 శాతం, చైనాపై 34 శాతం, ఐరోపా సమాఖ్యపై 20 శాతం, దక్షిణ కొరియాపై 25 శాతం, తైవాన్ పై 32 శాతం, జపాన్ పై 24 శాతం సుంకాలు ప్రకటించారు. దీనికి బదులుగా చైనా కూడా అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 34 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించింది. ఐరోపా సమాఖ్యతో పాటు ఇతర దేశాలు కూడా ఇదే బాటలో పయనించేందుకు సిద్ధమవుతున్నాయి. దీంతో ఇది అంతర్జాతీయ వాణిజ్య యుద్ధానికి దారితీసే ప్రమాదముంది.

**మాంద్యం భయాలు**

2020 తర్వాత అమెరికా స్టాక్ మార్కెట్లు ఒక్క సెషన్లలో భారీ క్షీణత నమోదు చేశాయి. ఒక్కరోజే ఎస్ అండ్ పీ 500 కంపెనీల మార్కెట్ విలువ 2.4 ట్రిలియన్ డాలర్లు తగ్గింది. ఫలితంగా ఆసియా మార్కెట్లు, భారత మార్కెట్లు కూడా కుప్పకూలాయి. ట్రంప్ వాణిజ్య విధానాలు ఇలాగే కొనసాగితే ప్రపంచ మాంద్యం తప్పదనే ఆందోళనలు పెరుగుతున్నాయి. దీంతో మదుపర్లు ఈక్విటీ మార్కెట్ ను వీడి ట్రెజరీ బాండ్స్, గోల్డ్ వైపు పెట్టుబడులు మళ్లిస్తున్నారు. టారిఫ్ ల నుంచి ఫార్మా ప్రొడక్టులకు మినహాయిస్తున్నట్లు గురువారం ప్రకటించారు ట్రంప్. కానీ రాబోయే రోజుల్లో ఫార్మా సెక్టార్ ను లక్ష్యంగా చేసుకుని కొత్త టారిఫ్లు విధించనున్నట్లు హెచ్చరించారు. దీంతో భారత ఫార్మా కంపెనీల షేర్లు ఈరోజు భారీగా పతనమయ్యాయి. ఫలితంగా సూచీల నష్టాలకు కారణమయ్యాయి.

# దిగొచ్చిన బంగారం ధరలు

- **ఒక్కరోజే రూ.1,600 పతనం**
- **పదిగ్రాముల బంగారం రూ.91,640**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బంగారం కొనుగోలు చేసే వారికి ఎట్టకేలకు శుభవార్త అందింది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన ప్రతీకార సుంకాల నేపథ్యంలో.. ఆర్థిక అనిశ్చితి నెలకొనగా.. బంగారం ధరలు భారీగా పెరిగిన సంగతి తెలిసిందే. సంక్షోభ సమయంలో సురక్షిత పెట్టుబడిగా బంగారాన్ని భావించి.. పెట్టుబడులు పెరగ్గా రేట్లు కూడా ఆల్ టైమ్ గరిష్ట స్థాయిలకు చేరాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో కిందటి రోజు ఉదయం ఒక దశలో స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు (31.10 గ్రాములు) 3168 డాలర్ల వద్ద జీవన కాల గరిష్టాన్ని నమోదు చేశాయి. అయితే ఉన్నట్లుండి ఒక్కరోజులోనే సీన్ రివర్స్ అయింది. అంతర్జాతీయంగా, దేశీయంగా ధరలు భారీగా పడిపోవడం గమనార్హం.

ఇదే సమయంలో దేశీయంగా కూడా ఇప్పటికే గోల్డ్ రేట్లు భారీగా పడిపోయాయి. హైదరాబాద్ నగరంలో 22 క్యారెట్ల పసిడి ధర తాజాగా రూ. 1600 పడిపోగా.. తులం రూ. 84 వేలకు దిగొచ్చింది. 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 1740 తగ్గి 10 గ్రాములు రూ. 91,640 కి పడిపోయింది. మరోవైపు వెండి ధర ఒక్కరోజులోనే రూ. 4 వేలు తగ్గడం విశేషం. అయితే.. ఇప్పుడు ఇన్వెస్టర్లు ఈ రోజు విడుదల కానున్న యూఎస్ నాన్‌ఫామ్ పేరోల్స్ (NFP) డేటాపై దృష్టి సారించారు. ఈ డేటా యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల భవిష్యత్తు నిర్ణయాలను ప్రభావితం చేయనుంది, దీని ఫలితంగా బంగారం ధరలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శనివారం,
05.04.2025
హైదరాబాద్
epaper:vishalabharathi.com
www.vishalabharathi.com



## ట్రంప్‌కి షాకిచ్చిన చైనా

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:** ప్రపంచవ్యాప్తంగా క్రమంగా వాణిజ్య యుద్ధం మొదలయ్యేలా ఉంది. ఎందుకంటే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల భారత్, చైనా సహా అనేక దేశాలపై సుంకాలను ప్రకటించారు. ఆ క్రమంలోనే చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 34% సుంకాలను విధించనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ట్రంప్ నిర్ణయానికి ధీటుగా అమెరికా నుంచి చైనాకు వచ్చే వస్తువులపై 34% సుంకం విధించనున్నట్లు చైనా ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారికంగా తెలిపింది. ఈ చర్య తర్వాత ఇరు దేశాల మధ్య వాణిజ్య యుద్ధం మరింత పెరిగే మాదిరిగా అనిపిస్తుంది. చైనా మరో కీలకమైన నిర్ణయం కూడా తీసుకుంది. చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ 11 అమెరికన్ కంపెనీలను "విశ్వసనీయత లేని సంస్థల" జాబితాలో చేర్చింది. ఈ సంస్థలు చైనాతో వ్యాపారం చేయడాన్ని తీవ్రంగా నిషేధించేలా చైనా చర్యలు తీసుకుంటోంది. ఈ జాబితాలో చేరిన సంస్థలు చైనాలో తమ వ్యాపార కార్యకలాపాలను కొనసాగించలేవు.

# చెన్నూరు రిజర్వాయర్ భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించండి

- రూ.25 కోట్లు వెంటనే విడుదల చేయాలి
- తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి విజ్ఞప్తి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి శుక్రవారం నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాలకుర్తి మండలంలోని చెన్నూరు రిజర్వాయర్ నిర్మాణం కారణంగా భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు మిగిలిన ₹25 కోట్ల పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. చెన్నూరు రిజర్వాయర్ నిర్మాణం వల్ల బహుళ గ్రామాలు ప్రభావితమయ్యాయన్నారు. భూములు కోల్పోయిన రైతులు, నిర్వాసితులు తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని... వారికి అందాల్సిన పరిహారం ఇప్పటికీ పూర్తి స్థాయిలో అందలేదని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే మిగిలిన రూ.25 కోట్లు విడుదల చేయాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు భూ నిర్వాసితుల సమస్యలను స్పష్టంగా వివరించారు. ప్రభుత్వం నుండి త్వరగా న్యాయం జరగాలని. నిర్వాసితుల కుటుంబాలు నష్టపోకుండా, తగిన పరిహారం అందించాలి. వారు సకాలంలో న్యాయమైన పరిహారం పొందేలా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ విషయాన్ని సానుకూలంగా పరిశీలించనున్నట్లు హామీ ఇచ్చారు. వీలైనంత త్వరగా పరిహారం విడుదలకు సంబంధిత అధికారులను ఆదేశిస్తామని తెలిపారు.

# డబల్ బెడ్‌రూమ్ ఇళ్ల బిల్లులు క్లీయర్ చేయండి

- మంత్రి పొంగులేటికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి విజ్ఞప్తి
- మంత్రితో మర్యాదపూర్వక భేటీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి శుక్రవారం నాడు తెలంగాణ గౌరవ గృహ నిర్మాణ, శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా, రాయపర్తి మండలం కొత్తూరు గ్రామంలో నిరుపేదలకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు సుమారు రూ.30 లక్షల మేర పెండింగ్‌లో ఉన్నాయని వాటిని తక్షణమే విడుదల చేయాలని వారు కోరారు. ఈ బిల్లుల అనుమతి ఆలస్యం కావడంతో కాంట్రాక్టర్లు, లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు మంత్రికి వివరించారు. అంతేకాకుండా, పాలకుర్తి నియోజకవర్గం అంతటా రూ. 1.30 కోట్ల వరకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, అవి కూడా త్వరగా క్లియర్ చేయాల్సిందిగా మంత్రికి విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారులు తమ ఇళ్లను పూర్తి చేసుకుని వేగంగా జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసి ఇరకాటంలో పెట్టారని అన్నారు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల బిల్లుల మంజూరు ఆలస్యమైతే, చెల్లింపులు లేనందున తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. బిల్లుల విడుదల ప్రక్రియను వేగవంతం చేసి, వెంటనే క్లియర్ చేయడానికి సంబంధిత అధికారులకు సూచనలు ఇస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కొడకండ్ల మండల అధ్యక్షులు సురేష్‌నాయక్, శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్‌ది ఫెవికాల్ బంధం

- మొన్న డీలిమిటేషన్ పేరుతో ఒక్కటయ్యారు
- నిన్న వక్ఫ్ బోర్డు బిల్లుపై కేంద్రానికి వ్యతిరేకంగా ఓటేశారు
- ఈరోజు మజ్లిస్ ను గెలిపించేందుకు రెండు పార్టీలు పోటీకి దూరమయ్యాయి
- ఇక బీఆర్ఎస్ అవినీతి కేసుల సంగతి సరేసరి
- కుమ్మక్కు రాజకీయాలకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి?
- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడుతున్నాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రెండు పార్టీల మధ్య ఫెవికాల్ బంధం కొనసాగుతోందన్నారు. డీలిమిటేషన్ పేరుతో మొన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయని.. త్వరలో తెలంగాణలో కలిసే బహిరంగ సభను నిర్వహించబోతున్నాయన్నారు. ఈ బహిరంగ సభ ఏర్పాట్లు రెండు పార్టీలు కలిసే పనిచేస్తున్నాయన్నారు. ఎవరిని పిలవాలో కలిసే డిసైడ్ చేస్తున్నాయన్నారు. అట్లాగే నిన్న పార్లమెంట్ లో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై నిర్వహించిన ఓటింగ్ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటై కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేశాయని తెలిపారు. అలాగే జీహెచ్ఎంసీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ కు చివరి రోజు. అయినప్పటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను నిలబెట్టకుండా మజ్లిస్ అభ్యర్థికి మద్దతుగా నిలిచాయని తెలిపారు. ఇక అవినీతి కేసుల సంగతి సరే సరి అని.. నీరుగార్చారని తెలిపారు. ఎన్నికలకు ముందు కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ కుటుంబం రూ.లక్ష కోట్లు అవినీతికి పాల్పడ్డారని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిసహా కాంగ్రెస్ నాయకులంతా కోడైకూశారని.. విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందం, ధరణి పోర్టల్ లో వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారన్నారు. ఫార్ములా ఈ రేసులో కేటీఆర్ అవినీతి చేశారని పదేపదే ప్రచారం చేశారని.. అధికారంలోకి రాగానే కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపుతామన్న కాంగ్రెస్ నేతలు... తీరా గెలిచాక డబ్బు సంచులకు అమ్ముడుపోయి బీఆర్ఎస్ తో కుమ్మకై అవినీతి కేసులన్నీ నీరుగారుస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? అని ప్రశ్నించారు. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడంవల్ల గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీలు పోటీ చేయాల్సిన 30 చోట్ల మజ్లిస్ పోటీ చేసి గెలిచిందన్నారు. ఇప్పుడు బీసీ జాబితా ముసుగులో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడంవల్ల విద్య, ఉద్యోగాల్లో బీసీలకు తీరని అన్యాయం జరగబోతోందన్నారు. ఈ రెండు పార్టీలు కలిసి హైదరాబాద్ ను మజ్లిస్ పార్టీ చేతుల్లో పెట్టడానికి సిద్ధమయ్యాయన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ చీకటి ఒప్పందాలు, కుమ్మక్కు రాజకీయాలపై తెలంగాణ సమాజం ఆలోచించాలని కోరారు.




# ఉద్యోగాలిస్తేనే రాష్ట్ర ఏర్పాటుకు సార్థకత

మొదటి పేజీ తరువాయి

అప్రమత్తంగా ఉండాలని కోరారు. యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌కు చెందిన 112 మంది భూనిర్వాసితులకు జెన్‌కోలో ఉద్యోగాలు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వారితోపాటు డివిజనల్ అకౌంట్స్ అధికారులుగా ఎంపికైన 51 మందికి మాదాపూర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో భట్టి నియామకపత్రాలు ఇచ్చారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ భూనిర్వాసితులకు ఉద్యోగాలిస్తామని గత పాలకులు చెప్పినా కార్యరూపం దాల్చలేదని గుర్తు చేశారు. పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం రేవంత్, తాను సమష్టిగా ఆలోచించి,భూనిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇచ్చిన మాటప్రకారం ఇప్పుడు 112మందికి నియామక పత్రాలు ఇచ్చామన్నారు. ఇదే సందర్భంలో ఆర్థికశాఖలో 51 మంది డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రజా ప్రభుత్వ పాలనలో 59,000 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ నియామక పత్రాలు అందించి, ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించామన్నారు. ఉద్యోగాలు పొందలేని యువత కోసం రూ.9,000కోట్లతో స్వయం ఉపాధి పథకాలు అందించడానికి రాజీవ్ యువ వికాస పథకాన్ని ప్రారంభించామన్నారు. లబ్ధిదారుల ఎంపిక నుంచి గ్రౌండింగ్ వరకు క్యాలెండర్‌ను ముందుగానే ప్రకటించామని, నిర్ణీత వ్యవధిలో పథకాన్ని అమలుచేస్తామని ప్రకటించారు. ఇటీవల దావోస్‌లో రూ.1.80లక్షలకోట్ల పెట్టుబడులకు సీఎం రేవంత్‌ఎంవోయూ చేసుకున్నారని, రానున్న రోజుల్లో ఆయా సంస్థల ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. హైదరాబాద్ విస్తరణలో భాగంగానే ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి పూనుకున్నామన్నారు. అభివృద్ధిలో దేశం,ప్రపంచంతో తెలంగాణ పోటీ పడుతోందన్నారు. సంక్షేమ పథకాలు అందిస్తూనే పెట్టుబడి వ్యయం అధికంగా వెచ్చించినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని పేర్కొన్నారు. "నేను 4 నెలల్లోనే పదవీ విరమణ చేసేవాడిని. మీరు 35 ఏళ్లు సర్వీసులో ఉంటారు. ప్రజలకు సేవలందించేందుకు పునరంకితం కావాలి" అని సూచించారు.

# రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ గా సీతా దయాకర్ రెడ్డి

- మరో ఆరుగురు సభ్యులు కూడా
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- బాధ్యతలు స్వీకరించిన చైర్ పర్సన్




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ గా మాజీ ఎమ్మెల్యే కొత్తకోట సీతాదయాకర్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. సీతాదయాకర్ రెడ్డితో పాటు ఆరుగురు సభ్యులను నియమించింది. కంచర్ల వందనగౌడ్, మర్రిపల్లి చందన, బి.అపర్ణ, గోగుల సరిత, ప్రేమలతా అగర్వాల్, బి.వచన్ కుమార్ లను సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి అనితా రామచంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి మూడు సంవత్సరాలు లేదా వారికి 60 ఏళ్ల వయసు వచ్చే వరకు పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈ మేరకు గురువారం సీతాదయాకర్ రెడ్డికి నియామకపు ఉత్తర్వులు అందడంతో ఆమె శుక్రవారం మధురానగర్‌లోని కమిషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 1994లో రాజకీయాల్లోకి ప్రవేశించిన సీతా దయాకర్ రెడ్డి 2001 లో దేవరకద్ర జడ్పీటీసీ సభ్యురాలుగా విజయం సాధించి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గా పని చేశారు. 2009లో దేవరకద్ర ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. అదే సమయంలో ఆమె భర్త దయాకర్ రెడ్డి సైతం మక్తల్ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో. ఒకే సమయంలో భార్యాభర్తలు అసెంబ్లీలో ప్రవేశించిన ఘనతను సాధించారు. 2014లో దేవరకద్ర ఎమ్మెల్యేగా రెండవసారి పోటీ చేసి ఓడిపోయారు. తెలుగుదేశం పార్టీతో రాజకీయ ప్రస్థానం ప్రారంభమైన సీతా దయాకర్ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు వరకు అదే పార్టీలో కొనసాగుతూ వచ్చారు. అసెంబ్లీ ఎన్నికల కు కొన్ని వారాల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం, విద్యార్హతలు ఉన్న కారణంగా సీతా దయాకర్ రెడ్డి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్పర్సన్ గా ప్రభుత్వం నియమించింది. సీతా దయాకర్ రెడ్డికి పదవి దక్కడంతో ఉమ్మడి జిల్లాలో ఉన్న వారి అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మళ్లీ ఓడిన ముంబయి

**విశాలభారతి, స్పోర్ట్స్ బ్యూరో:** ఐపీఎల్ 2025లో లక్నో సూపర్ జయింట్స్ థ్రిల్లింగ్ విక్టరీ కొట్టింది. ఏకనా క్రికెట్ స్టేడియంలో ముంబై ఇండియన్స్ తో జరిగిన మ్యాచ్ లో 12 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది. బ్యాటింగ్ లో మార్ష్ (60), మార్కరం (53) హాఫ్ సెంచరీలు తోడు బౌలర్లు సమిష్టిగా రాణించడంతో ఈ టోర్నీలో రెండో గెలుపు నమోదు చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 203 పరుగుల భారీ స్కోర్ చేసింది. లక్ష్య ఛేదనలో ముంబై 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 191 పరుగులకు పరిమితమైంది.204 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబైకి ఊహించని షాక్ తగిలింది. ఓపెనర్లు విల్ జాక్స్ (5), రికెల్ టన్(7) సింగిల్ డిజిట్ కే పరిమితమయ్యారు. రెండో ఓవర్లో ఆకాష్ దీప్ బౌలింగ్ లో జాక్స్ ఔట్ కాగా.. మూడో ఓవర్ లో శార్దూల్ ఠాకూర్ రికెల్ టన్ ను పెవిలియన్ కు పంపాడు. దీంతో ముంబై 17 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో నమన్ ధీర్, సూర్య కుమార్ యాదవ్ జట్టును నిలబెట్టారు. ముఖ్యంగా నమన్ దీర్ పవర్ ప్లే లో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఆకాష్ దీప్ వేసిన నాలుగో ఓవర్ లో 21 పరుగులు రాబట్టాడు. నమన్ ఆటతో ముంబై పవర్ ప్లేలో 64 పరుగులు చేసింది. పవర్ ప్లే తర్వాత నమన్ దీర్ (46) ఔటైనా.. కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్, తిలక్ వర్మ (24) ఇన్నింగ్స్ ను ముందుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో సూర్య 31 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. చివరి 5 ఓవర్లలో జట్టు విజయానికి 61 పరుగులు కావాల్సిన దశలో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది.





# బలగం గ్రామీణ జీవితాన్ని హృదయానికి హత్తుకుంది

- పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఝాన్సీరెడ్డి

**విశాలభారతి,పాలకుర్తి:** ప్రముఖ సినీ దర్శకుడు, బలగం సినిమాలో నటుడిగా, దర్శకుడిగా పేరు తెచ్చుకున్న వేణు శుక్రవారం పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డిని పాలకుర్తిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి వేణుని గౌరవప్రదంగా సన్మానించి, ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. బలగం సినిమా ద్వారా గ్రామీణ జీవితాన్ని హృదయానికి హత్తుకునే విధంగా ప్రజలకు చేరువ చేయడంతో పాటు, కుటుంబ సంబంధాలను, విలువలను చక్కగా చిత్రీకరించినందుకు వారు ప్రత్యేకంగా ప్రశంసించారు వేణు మరిన్ని మంచి సినిమాలు నిర్మించి,ప్రేక్షకులను అలరించాలి. భారతీయ సినీ రంగంలో మరింత గొప్ప స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు, అభిమానులు, సినీ ప్రేమికులు, ఇతర స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. వేణు గారు తమపై చూపిన గౌరవానికి ధన్యవాదాలు తెలిపి, తన భవిష్యత్తు ప్రాజెక్టుల గురించి పంచుకున్నారు. సమావేశం ఆత్మీయ వాతావరణంలో జరిగింది..

## జాబ్‌కార్డులు అందక.. ఉపాధి దొరక్క!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డుల జారీ ప్రక్రియ నిలిపివేతతో కూలీలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలుచేస్తున్న నేపథ్యంలో ఈ పనులకు డిమాండ్ పెరిగింది. వ్యవసాయ భూమి లేని ఉపాధి హామీ పథకం కూలీలు ఆత్మీయ భరోసా పథకానికి అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది. నవంబరు 2024లో ఉపాధి హామీ జాబ్‌కార్డుల జారీ ప్రక్రియను నిలిపివేశారు. ఈక్రమంలో గ్రామాల్లో వివాహాలైన యువతకు జాబ్‌కార్డులు లేకపోవడంతో పనులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. వ్యవసాయాభివృద్ధి లక్ష్యంగా పల్లెల్లో జరుగుతున్న కాలువలు, ఫాంపాండ్, ఇంకుడుగుంతలు, ఫిష్‌పాండ్ వంటి పనులకు వెళ్లే అవకాశాలు లేకుండా పోయాయని దిగులు చెందుతున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ 2025-26 సంవత్సరానికి రోజువారీ వేతనాన్ని రూ.307గా నిర్ణయిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో రూ.300 ఉండగా తాజా ఉత్తర్వులతో రూ.7 పెరిగింది.



## బైక్ షోరూంను ప్రారంభించిన పల్లె రవికుమార్ గౌడ్

**చౌటుప్పల్, విశాలభారతి:** మండల కేంద్రంలోని తంగేడుపల్లి రోడ్ లో ఏర్పాటు చేసిన నూతన ఎలక్ట్రిక్ బైక్ షోరూం ను తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ ప్రారంభించడం జరిగింది. తదనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో విపరీత వాతావరణ కాలుష్యంలో భాగంగా ప్రజలు కాలుష్య నివారణనే ద్యేయంగా ఇలాంటి ఎలక్ట్రిక్ వాహనాల పై దృష్టి పెంచి కాలుష్యం నివారణకు దొహదపడాలన్నారు. రాబోయే కాలంలో వాతావరణం బాగుండాలంటే విద్యుత్ వాహనాలను కొనుగోలు చేయాలనీ,ఈ వాహనాల ఉపయోగంలో ప్రతి ఒక్కరికి డబ్బులు ఆదా చేయడంతో పాటు పర్యావరణన్ని కాపాడే వారావుతారని తెలిపారు. తదనంతరం ఆ కంపెనీ డైరెక్టర్స్ బోయ రాకేష్,ఎస్కే ఖాదర్ లకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బోయ.దేవేందర్,బాబా షరీఫ్ మాజీ కాన్సిలర్, విరమళ్ళ వెంకటేష్ గౌడ్, బడేటి సత్యనారాయణ, ఉష్కాగుల నాగరాజు, చలామంద రాజు, తుర్పింటి రవి,కడగంచి రాజేష్,ఎండీ యూసఫ్,బోయ లింగస్వామి,ఆరుట్ల లింగస్వామి బైరు శేఖర్,వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## డ్రగ్స్,సైబర్ నేరాలపై పోలీసు కళాభృందంతో అవగాహన




**నూతనకల్, విశాలభారతి:** మండల పరిధిలోని దిర్శినపల్లి గ్రామంలో సైబర్ నేరాలపైన, గంజాయి, డ్రగ్స్ మత్తుమందులపై, రోడ్డు ప్రమాదాలపై పోలీసు కళాభృందంతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేంద్ర నాథ్ మాట్లాడుతూ జిల్లా ఎస్పి కె నరసింహ ఐపిఎస్ అధ్వర్యంలో పోలీస్ ప్రజా భరోసా, రోడ్డు ప్రమాదాలపై , సైబర్ నేరాలపై, గంజాయి డ్రగ్స్ మత్తు మందులు, ఆన్ లైన్ బెట్టింగ్, మూఢనమ్మకాల పైన పటిష్టంగా పనిచేస్తున్నామని తెలిపారు. సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దు అని, బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డ్ వివరాలు, ఓటిపి వివరాలు ఇతరులకు తెలపవద్దు, ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావొద్దు. మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దు అని కోరినారు.సైబర్ మోసాలపై 1930టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు. అలాగే రోడ్డు నియమ నిబంధనలు తెలుసుకోవాలని అతివేగం ప్రయాణించవద్దు అని వేధింపులపై 100కు సమాచారం ఇవ్వాలని తెలిపినారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నెంబర్లు, సోషల్ మీడియాలో బహిర్గతం చేయొద్దన్నారు. వ్యక్తిగత ఫోటోలను డిపి లుగా పెట్టుకోవద్దని చెప్పారు.మొబైల్ యాప్ లలో వచ్చేటువంటి అనవసరమైన బ్లూ లింకులను క్లిక్ చెయ్యొద్దు అని తెలిపారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దు అన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నవీన్ రెడ్డి, కళాబృందం ఇంచార్జ్ యల్లయ్య, గోపయ్య, గురులింగం, క్రిష్ణ, చారి, నాగార్జున, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## హెచ్ సీయు భూములను
# కార్పొరేట్ శక్తులకు అప్పగించొద్దు

- సుప్రీంకోర్టు స్టేను స్వాగతిస్తున్నాం
- సిపిఎం మండల కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి



**నూతనకల్, విశాలభారతి:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ చెందిన 400 ఎకరాల భూమిని ప్రభుత్వం సదును చేయడాన్ని ఆపాలని కోర్టు స్టే ఇవ్వడాన్ని సిపిఎం పార్టీ స్వాగతిస్తుందని ఆ పార్టీ కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి అన్నారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం వేలం వేసి కార్పోరేట్ సంస్థలకు కట్టబెట్టాలని ప్రయత్నంలో చెట్లను తొలగించి భూమిని చదును చేసి జంతువులకు జీవరాశులకు తీవ్ర ఇబ్బంది కలిగించే చర్యలకు పాల్పడుతున్నది. దీని వ్యతిరేకించిన విద్యార్థులపై లాటిచార్జీ అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపింది .ఈ చర్యలను నిలిపివేయాలని కోర్టు స్టే విధించడాన్ని సిపిఎం పార్టీ స్వాగతిస్తున్నది. ఈ స్టేనో దృష్టిలో పెట్టుకుని భూముల వేలం వేసే ప్రక్రియను ప్రభుత్వం ఉపసంహరించాలని ఉపసంహరించుకోవాలని విద్యార్థుల పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని వారన్నారు.



## మార్కెట్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

- వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఎల్సోజు చామంతి నరేష్

**తిరుమలగిరి, విశాలభారతి:** వ్యాపార వాణిజ్యపరంగా మూడు జిల్లాలకు కూడలి నియోజకవర్గం లోని అతిపెద్ద మార్కెట్ అయిన తిరుమలగిరి మార్కెట్ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్సో జు చామంతి నరేష్ శుక్రవారం నాడు హైదరాబాదులో తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్, రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయికి వినతిపత్రం అందజేశారు. గతంలో ఎంతో అభివృద్ధి చెంది జిల్లాలోని పేరుగాంచిన తిరుమలగిరి మార్కెట్ కు గత పాలకులు నిధులు మంజూరు చేయకపోవడంతో అభివృద్ధిలో వెనుకబడిపోయిందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న ప్రజాపాలన తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామెల్ సారధ్యంలో తిరుమలగిరి మార్కెట్ అభివృద్ధికి ఇతోదికంగా నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే దూర ప్రాంతాల నుండి తమ సరుకులను కొనుగోలు చేయడానికి వచ్చే రైతులకు పలు సౌకర్యాలతో పాటు గ్రామాల్లో సిసి రోడ్లు, మార్కెట్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడానికి తాను కృషి చేస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు పక్షపాతి అని రైతులకు గిట్టుబాటు ధరతో పాటు 500 రూపాయల బోనస్ రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి కే దక్కిందని అన్నారు. తిరుమలగిరి మార్కెట్ అభివృద్ధి పథంలో పయనించాలంటే నిధులు మంజూరు చేయాలని వారు కోరారు.



## ఎంపీడీవో సమ్మె నోటీసులు అందజేసిన జిపి కార్మికుల

**గరిడేపల్లి, విశాలభారతి:** ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా నాయకులు మాట్లాడుతూ ట్రెజరీలో నిలిచిన 2024 జులై డిసెంబర్ వరకు ఆరు నెలల వేతన బకాయిలు విడుదల చేయాలని ముఖ్యమంత్రి ప్రకటించినట్లుగా గ్రీన్ ఛానల్ ద్వారా 2025 జనవరి నుండి వేతనాలు చెల్లించాలని జీవో నెంబర్ 51ని సవరించి మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని రెండవ పిఆర్ సి ని వర్తింపచేసి ప్రస్తుత తం ఇస్తున్న వేతనాలను 18 వేలకు పెంచాలని 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ ఈనెల 19 వరకు పరిష్కారం చూపాలని లేనియెడల ఏరోజైనా రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు షేక్ యాకోబు తెలిపారు పంచాయతీ కార్మికుల పరిష్కారానికి ముఖ్యమంత్రి స్పందించాలని వేతనాలు చెల్లింపులు జరుగు జాప్యానికి శాస్త్ర పరిష్కారం చూడాలని యాకోబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిపి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కొండ సైదులు, పళ్ళ బాలకృష్ణ, చిటికెల రాజు, హరీష్ వెంకటయ్య సతీష్ నాగరాజు సైదులు వీరస్వామి వరప్రసాద్ మామిడి గోపి పాల్గొన్నారు.




## వీధి కుక్కల,కోతుల నియంత్రణ చర్యలు చేపట్టాలి

- గొర్రె,మేకల పెంపక దారులు సంఘం

**చౌటుప్పల్, విశాలభారతి:** మండలంలోని అంకిరెడ్డిగూడెం గ్రామంలో వీధి కుక్కలా మరియు కోతుల నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగాపురం పాండుకు గొర్రె,మేకల పెంపకదారుల సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.తదనంతరం గొర్రె,మేకల పెంపకదారుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ కార్యదర్శి కొండే శ్రీశైలం మాట్లాడుతూ వీధి కుక్కలు, కోతులు గ్రామంలో స్వయం విహారం చేస్తూ గొర్రె,మేకల మందలపై పడి దాడిచేసి వాటిని చంపేస్తున్నాయని వెంటనే వాటి బెడదను నివారించాలని మరియు వాటికి నీటితోట్లు రిపేరు చేయించి గొర్రెల, మేకలకు నీరు అందించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జిఎంపిఎస్ మండల కార్యదర్శి వర్గ సభ్యులు భీమనగని బాలరాజు నాయకులు బర్మా లింగస్వామి, బర్మా బంజారా,బెడద మల్లేశం,బెడద శ్రీనివాసు,ఎర్రగోని శ్రీనివాసు, దండగ జంగయ్య, యాదయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.




## అన్ని దానాలలో కంటే జలదానం గొప్పది

**తొర్రూర్, విశాలభారతి:** మండలంలోని గుర్తురు గ్రామంలో బాల వికాస అనుబంధ సంఘమైన జన వికాస సంఘం ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇసంపల్లి బాలకృష్ణ సహకారంతో చలివేంద్రాన్ని బస్ స్టాండ్ సమీపంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలవికాస ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని, బాటసారులకు దాహాని తీర్చడం కోసమై చలివేంద్రం ఏర్పాటు అభినందనీయ అని,మహిళల సంక్షేమం కొరకు బాలవికాస ఆధ్వర్యంలో అనేక స్వచ్ఛంద సేవ కార్యక్రమాలను నిర్వహించి మహిళలను ప్రోత్సహించడం చాలా అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో బాలవికాస మెయిన్ కోఆర్డినేటర్ జలగం శైలజ, కోఆర్డినేటర్ శోభారాణి, మాజీ ఎంపీటీసీ కవిత,వార్డ్ సభ్యులు,బాలవికాస సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## బీసీ కుల మహా గర్జన విజయవంతం

- కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి.
- బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి..

**హైదరాబాద్,విశాల భారతి:** బీసీ రిజర్వేషన్లు కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన బీసీల మహా గర్జన విజయవంతం కావడం సంతోషంగా ఉందని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అన్నారు. ఈ మహా గర్జనను చూసైనా కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జేఏసీ కార్యాలయం నుండి గణేష్ చారి పత్రిక ప్రకటన విడుదల చేశారు. స్వాతంత్రం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి పోయారని దీనికి పాలకులే కారణమన్నారు. ప్రభుత్వాలు మారుతున్న బీసీల స్థితిగతులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కొత్త కొత్త పథకాలు తీసుకవస్తున్న బీసీల కులవృత్తులు కనుమరుగవుతుంటే ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని విమర్శించారు. దేశంలో 90 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభాకు తగినట్టుగా బడ్జెట్, రిజర్వేషన్లు లేకపోవడమే వెనుకబాటు తనానికి కారణమన్నారు. బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ రాష్ట్రం ముందుకు వచ్చి చట్టసభలో బిసి బిల్లును పాస్ చేసి కేంద్రానికి పంపడం సంతోషకరమని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంటులో బిసి బిల్లును ప్రవేశపెట్టి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళన తప్పదని హెచ్చరించారు.ఈ మహాగర్జనతో తెలంగాణ రాష్ట్రం నుండి ముఖ్యమంత్రి మంత్రులు తో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన ఎంపీలు బీసీలు పెద్ద ఎత్తున తరలి రావడం బిసి వాదానికి బలం చేకూరిందని, మాహా గర్జనకు వచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీవారి కల్యాణంలో భక్తజనులు
# అధిక సంఖ్యలో పాల్గొనండి

- బ్రహ్మోత్సవం వేడుకల్లో కుటుంబ సమేతంగా పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు



**కూకట్ పల్లి , విశాలభారతి:** కూకట్ పల్లి వివేకానందనగర్ లోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో ఈనెల 2నుంచి 6వ తేదీ వరకు జరిగే 34'వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ బ్రహ్మోత్సవ వేడుకలకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు సతీసమేతంగా శుక్రవారం నాడు శ్రీవర్ల శాంతి కళ్యాణ మహోత్సవములో పాల్గొని శ్రీమన్నారాయణ కృపాకటాక్షాలకు పొందారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ లోకకళ్యాణార్థం కొరకు నిర్వహించే శ్రీవారి కల్యాణంలో భక్తజనులు అందరూ 6వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించే శ్రీరామనవమి వేడుకల్లో ప్రతి ఒక్క హిందువు తప్పనిసరిగా పాల్గొనాలని వడ్డేపల్లి రాజేశ్వరరావు కోరారు.



## అద్దంకి దయాకర్‌కు
## జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కర్క నాగరాజు

**కూకట్ పల్లి,విశాలభారతి:** కూకట్పల్లి నియోజకవర్గం ఐ.యన్.టి యు.సి అధ్యక్షులు కర్కనాగరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ డాక్టర్ అద్దంకి దయాకర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బంజారాభవన్ లో ఆయనకు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూల బొకే తో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కూకట్పల్లి నియోజకవర్గం అధ్యక్షులు కూతడి కృష్ణా,వడ్డే నాగార్జున, పిల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
05.04.2025
హైదరాబాద్
epaper:vishalabharathi.com
www.vishalabharathi.com
5
vishalabharathi Telugu Daily



## వక్ఫ్ బోర్డు బిల్లు ఆమోదంపై బీజేపీ సంబరాలు

**ఆమనగల్లు,విశాలభారతి:**
పార్లమెంటులో వర్ఫ్ బోర్డు సవరణ బిల్లును ఆమోదించడాన్ని హర్షిస్తూ శుక్రవారం ఆమనగల్లు పట్టణంలో జాతీయ రహదారిపై బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. వక్స్ బిల్లు ఆమోదంతో పేద ముస్లింలకు మేలు జరుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కండె హరిప్రసాద్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ మండల బిజెపి మండల అధ్యక్షులు ఎర్రవోలు శ్రీనివాస్,నియోజకవర్గ కో కన్వీనర్ గోరేటి నరసింహ, మున్సిపాలిటీ నాయకులు చెక్కల లక్ష్మణ్, చెన్నకేశవులు,పాషా, ప్రభాకర్, శ్రీను, మహేష్,శ్రీనివాస్, జంగయ్య,శ్రీశైలం,శ్రీశైలం, మహేష్, బుచ్చయ్య, పారేశా తదితరులు పాల్గొన్నారు.



## రామనవమి శోభాయాత్ర ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

**కూకట్పల్లి, విశాలభారతి:**
శ్రీ రామనవమిని పురస్కరించుకొని ఆదివారం నాడు నిర్వహించనున్న శోభాయాత్రను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని శ్రీరామ భక్త హనుమాన్ హిందూ రాష్ట్ర సమితి అధ్యక్షులు శ్రీ పెండ్యాల నాగరాజు వెల్లడించారు .ఈ నేపథ్యంలో ఆల్విన్ కాలనీ ఫేస్ 1 లోని హనుమాన్ ఆలయంలో కార్యవర్గ సభ్యులతో కలిసి శోభాయాత్రకు సంబంధించిన ఆహ్వాన పత్రికను శుక్రవారం నాడు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 4 గంటలకు అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. వివిధ కాలనీలకు చెందిన హిందూ నేతలు ,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శోభాయాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు రాము,వెంకటస్వామి రెడ్డి,అభిషేక్, నవీన్,సతీష్ లతో పాటు నేతలు మరియు స్థానికులు శివకుమార్, రామకృష్ణ,ప్రకాష్, నరసింహా రెడ్డి, రాయల్,అత్తరి రమేష్,సోమయ్య, కుమారచారి,వెంకటేశ్వర్ గౌడ్, వెంకటస్వామి,నాగరాజు,జయరాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మిస్సింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక దృష్టి సారించాలి

- ఆన్లైన్ బెట్టింగ్స్, సైబర్ ఫ్రాడ్స్ గురించి ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
- సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్
- బీడీఎల్ భానూర్ పోలీసు స్టేషన్ ఆకస్మిక తనిఖీ




**పటాన్ చెరు,విశాలభారతి**
బీడీఎల్ భానూర్ పోలీసు స్టేషన్ ను సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం స్టేషన్ రికార్డ్లను తనిఖీ చేస్తూ.. అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మిస్సింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, మిస్సింగ్ పర్సన్స్ ను ట్రేస్ చేయాలని అన్నారు. ప్రతి వర్టికల్ కు ఒక అధికారిని నియమించి, రికార్డ్స్ ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని ఎస్ హెచ్ఓ కు సూచనలు చేశారు. సిబ్బంది అధికారులు స్టేషన్ కు వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడాలని, సివిల్ తగాదాలలో తలదూర్చకూడదు అన్నారు. సిబ్బంది అధికారులు 24/7 అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణలో కృషి చేయాలని అన్నారు. హిస్టరీ షీటర్స్, సస్పెక్ట్స్ మరియు పాత నేరస్తులపై నిఘా ఉంచాలని అన్నారు. నైట్ బీట్, పెట్రోల్లింగ్ అధికారులు వీధి నిర్వాహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మన చుట్టూ జరుగుతున్న ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్స్, బెట్టింగ్ యాప్ గురించి, రోడ్డు ప్రమాదాల గురించి జిల్లా ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రధాన కూడళ్లలో ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయడం, బోలార్డ్స్, రాంబుల్ స్ట్రిప్స్ వేయించడం మరియు తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పార్ట్ లు గుర్తించి, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని అన్నారు. విజిబుల్ పోలిసింగ్ లో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్, ఈపెట్టి కేసులు నమోదు చేయాలని ఎస్ హెచ్ఓ స్వామి గౌడ్ కు పలు సూచనలు చేశారు.



## సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- 41 లక్షల రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**పటాన్ చెరు,విశాలభారతి**
నిరుపేదలకు కార్పోరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో. నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, పట్టణాలకు చెందిన 91 మంది లబ్ధిదారులకు మంజూరైన 41 లక్షల 21 వేల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే జిఎంఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నిరుపేదలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ వారి ఆర్థిక అభ్యున్నతికి అండగా ఉంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, సీనియర్ నాయకులు నర్సింలు, సంజీవ్ రెడ్డి, జగన్, అరీఫ్, తదితరులు పాల్గొన్నారు.




## రేషన్ షాప్ బ్యానర్లపై లోకల్ లీడర్ల ఫోటోలు

- కాంగ్రెస్ నాయకులకు ప్రోటోకాల్ పై కనీస అవగాహన లేదు
- రాజ్యాంగం పట్ల గౌరవం లేదు

**విశాలభారతి,భీమదేవరపల్లి :**
కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు ప్రోటోకాల్ మీద కనీస అవగాహన లేనట్టుందని బి.ఆర్.ఎస్ మండల అధ్యక్షులు మండల సురేందర్ అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల రేషన్ షాపులకు ఫ్లెక్సీ బ్యానర్లు పెట్టి స్థానిక, మండల, గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఫోటోలు వేసుకొని కాంగ్రెస్ పార్టీ అని బ్యానర్లు పెట్టడం వారికి రాజ్యాంగం పట్ల గౌరవం లేదని తెలుస్తుంది. రేషన్ షాపుకు పెట్టే బ్యానర్ పై ప్రజా ప్రతినిధుల ఫోటోలు మాత్రమే ఉండాలి అన్న కనీస అవగాహన వాళ్లకు లేదని దుయ్యబట్టారు. ఈ విషయంపై సంబంధిత పౌరసరఫరా శాఖ, ఎమ్మార్వో స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మండల సురేందర్, మాజీ ఎంపీటీసీ అప్పని బిక్షపతి, ముల్కనూర్ పట్టణ అధ్యక్షుడు శనిగరపు సదానందం, సీనియర్ నాయకుడు దార్న శ్రీనివాస్, మాడుగుల అశోక్, గుడికందుల రాజు, పూర్ణచందర్, శ్రీనాథ్, సుధాకర్ పాల్గొన్నారు.

## తెలంగాణ తొలి విత్తన పండుగ వార్షికోత్సవం

**ఆమనగల్లు, విశాలభారతి:**
కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ ఆధ్వర్యంలో భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ సహకారంతో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు కడ్తాల్ మండలం, అన్మాస్పల్లి గ్రామంలోని ది ఎర్త్ సెంటర్లో విత్తన పండుగ పేరుతో ప్రదర్శన అట్టహాసంగా ప్రారంభమైంది .తెలంగాణ రాష్ట్రంలోనే తొలి సారిగా నిర్వహిస్తున్న ఈ విత్తన పండుగలో 50 స్టాళ్లను ఏర్పాటు చేశారు.దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సేంద్రియ విత్తనాలను, వంగడాలను ప్రదర్శించారు.ఈ ప్రదర్శనకు హాజరయిన రైతులకు దేశీ విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు.స్థానిక విత్తనమే కేంద్రంగా, రైతే లక్ష్యంగా వ్యవసాయంలో వచ్చే సమూల మార్పులతోనే నిజమైన హరిత విప్లవం సాధ్యమని ప్రముఖ పర్యావరణవేత్త ప్రొ. పురుషోత్తమ్ రెడ్డి పేర్కొన్నారు. ఇకపై ఆ హరిత విప్లవమే మనందరికీ రక్ష అని, విత్తనాన్ని సంకరం చేసివ్యవసాయాన్ని రసాయనమయం చేసిన ప్రక్రియ 'హరిత విప్లవం' కాదని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ తొలి 'విత్తనాల పండుగ'ను శుక్రవారం ప్రారంభించి ఆయన ప్రసంగించానారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్సీజీఆర్, భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ మూడు రోజుల పండుగ కడ్తాల్ మండలం, అన్మాస్ పల్లిలో ఈ పండుగ మొదలయింది. కర్ణాటక,రాజస్థాన్, తమిళనాడు,కేరళ తదితర రాష్ట్రాల విత్తనాల నిపుణులు, ఆర్గానిక్ సంస్థలతో 52 స్టాల్స్ తో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. విత్తనాలు బ్యాంక్ ఏర్పాటు చేసి



ప్రజలకు అందుబాటులోకి తెస్తామని సంస్థ నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.అన్వేష్ రెడ్డి సుంకెటి మాట్లాడుతూ సంప్రదాయ విత్తనాలు గ్రామ స్థాయిలో అవగాహనతో విస్తృత పరచాలన్నారు. ఉమ్మడి జిల్లా కేంద్రలల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే సహకారం అందిస్తామని తెలిపారు. ఐఏఎస్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డబ్ల్యూ రాంపుల్లా రెడ్డి, ఎమినెంట్ సీడ్ కన్జర్వేటర్ (పద్మశ్రీ ) రైమతి ఘురియా ఒడిశా,భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ జాకబ్ నెల్లితాన్, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్.డా.డి.రాజి రెడ్డి, పబ్లిక్ పాలసీ నిపుణులు డా.దొంతి నరసింహా రెడ్డి,CGR అధ్యక్షులు కె. లీలా లక్ష్మా రెడ్డి,CGR వ్యవస్థాపకులు కె. లక్ష్మా రెడ్డి , రైతులు,విద్యార్థులు, ప్రొఫెసర్లు, మేధావులు, సైంటిస్టులు,డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



## ఐలా అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు,విశాలభారతి**
పటాన్ చెరు పారిశ్రామిక వాడ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు ఐలా నూతన కార్యవర్గం కమిటీ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ఆసియాలోనే అతి పెద్ద పారిశ్రామిక వాడగా పేరుందిన పటాన్ చెరు నియోజకవర్గంలో పరిశ్రమల యజమాన్యాలకు ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. పారిశ్రామిక వాడల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ అండగా ఉంటామని తెలిపారు. నూతన పరిశ్రమల ఏర్పాటుకు యాజమాన్యాలు మరింత ముందుకు రావాలని కోరారు. స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, ఐలా చైర్మన్ సుధీర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుటుంబ రావు, జగన్, సురేందర్ రెడ్డి, మురళి, శ్రీనివాస్, నారాయణ రెడ్డి, సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ రావు, శ్రీనివాస్, తిరుమల రావు, శంకర్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

**శ్రీ కోదండ సీతారాముల కళ్యాణానికి రారండి..**
**- ఎమ్మెల్యే జీఎంఆర్ దంపతులకు ఆహ్వాన పత్రికను అందజేసిన దేవాలయ కమిటీ**


శ్రీ రామ నవమి పర్వదినం పురస్కరించుకొని పటాన్ చెరు పట్టణంలోని శ్రీ కోదండ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఆదివారం నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దంపతులకు పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ దంపతులు, ఆలయ పూజారులు, కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 4వ తేదీ నుండి 8వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## రూ.లక్ష లంచం తీసుకుంటూ.. ఏసీబీకి చిక్కిన నీటిపారుదల శాఖ ఏఈ

- రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- వివరాలు వెల్లడించిన సిటీ రేంజ్ 2 ఏసీబీ డీఎస్పీ శ్రీధర్

**పటాన్ చెరు,విశాలభారతి**
అవినీతి నిరోధక శాఖ వలకు ఇరిగేషన్ ఏఈ రవి కిషోర్ చిక్కారు. ఎన్ఓసి కోసం లంచం అడిగిన ఏఈని పక్కా ప్లాన్ వేసి ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఎన్ఓసీకి లక్షల్లో డిమాండ్ చేయగా, చేసేదేమి లేక బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నీటిపారుదల శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో గుమ్మడిదల ఏఈగా విధులు నిర్వర్తిస్తున్న రవి కిషోర్ గుమ్మడిదల గ్రామానికి చెందిన ఓ భూమికి ఎన్ఓసీ కోసం లక్ష రూపాయల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికా









రులు పట్టుకున్నారు. సిటీ రేంజ్ 2 ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ విలేకరులకు వివరాలను తెలియజేశారు. గుమ్మడిదలకు చెందిన వ్యక్తి స్థలంలో ప్రహరీ గోడ నిర్మించగా నీటి పారుదల శాఖ ఏఈ రవి కిషోర్ అక్కడకు వెళ్లి నాలా ఉందని, నాలాకు సంబంధించి ఇరిగేషన్ నుంచి ఎన్ఓసీ తీసుకోవాలని కోరారు. లేదంటే కూల్చివేతలు ఉంటాయని హెచ్చరించారు. ఎన్ఓసీ మంజూరు కోసం పది లక్షలు డిమాండ్ చేయగా 7 లక్షలకు సెటిల్ అయింది. ఆ డబ్బుల కోసం ఏఈ తీవ్ర ఇబ్బందులు పెట్టడంతో బాధితుడు గత నెల 28న ఏసీబీ అధికారులను కలిసి ఫిర్యాదు చేశాడన్నారు. శుక్రవారం ఏఈ రవి కిషోర్ కు లక్ష రూపాయల డబ్బులిచ్చేలా ప్లాన్ చేయగా ఏఈ కారు డ్యాష్ బోర్డులో పెట్టమని చెప్పి వస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నామన్నారు. పటాన్ చెరు నీటిపారుదల శాఖ డీఈ రామస్వామి అప్పుడే వెళ్లిపోవడంతో తిరిగి రప్పించామన్నారు. ఎవరెవరి ప్రమేయం ఉందని, తదితర అంశాలపై పూర్తి స్థాయి విచారణ చేపడుతున్నామన్నారు. ఏఈ రవి కిషోర్ ను పూర్తిస్థాయిలో విచారించిన తర్వాత ఏసీబీ కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలిస్తామని ఏసీబీ డీఎస్పీ పేర్కొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
05.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## బాధిత కుటుంబానికి పరామర్శ



ఆర్మూర్, విశాలభారతి:
నందిపేట్ మండల కేంద్రంలో ఆర్మూర్ నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి పార్టీ ఇన్చార్జ్ ఆశన్న గారి రాజేశ్వర్ రెడ్డి శుక్రవారం నందిపేట్ మాజీ ఎంపీటీసీ సౌజన్య మురళి మేనత్త ఇటీవలే అకాల మరణం చెందింది.కావున కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు మచ్చర్ల సాగర్, సంతోష్, నందిపేట మండల నాయకులు శేఖర్, అశోక్ ,క్రాంతి పాల్గొన్నారు.





# రాజకీయ చైతన్యంతోనే జాతి మనుగడ

- ఐక్యమత్యంతో ముందుకు సాగుదాం
- ముదిరాజ్ ల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది
- బీసీ కులగణనతో మనకు మంచి రోజులు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో పెరగనున్న రాజకీయ ప్రాతినిధ్యం
- నీలం మధు ముదిరాజ్

పటాన్ చెరు,విశాలభారతి
మనమంతా కలిసికట్టుగా ఐక్యమత్యంతో ముందుకు సాగితేనే గుర్తింపు సాధ్యమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని మాతృశ్రీ గార్డెన్స్ లో ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నీలం మధు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రాజకీయ చైతన్యం అలవర్చుకోవాలన్నారు. రాజకీయ చైతన్యంతోనే జాతి మనుగడ సాధ్యమని వివరించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ముదిరాజ్ ల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణనతో ముదిరాజులకు మంచి రోజులు రానున్నాయని జోస్యం చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందని స్పష్టం చేశారు. ముదిరాజుల సుదీర్ఘ డిమాండ్ అయిన బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చే విషయంతో పాటు మత్స్యకార సంఘాలకు వడ్డీ లేని ఋణాలు, చేపల మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు మరికొన్ని అంశాలను ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. దశలవారీగా మన హక్కులను సాధించుకుందామని అన్నారు. సబ్బండ వర్గాలు, ముదిరాజ్ జాతి అభివృద్ధికి శక్తివంచనా లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొని వస్తే పెద్దలందరం కలిసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆ సమస్యల పరిష్కార సాధనకు కృషి చేద్దామన్నారు. తనమీద ప్రేమతో నన్ను ఈ బృహత్తర ఆత్మీయ సమ్మేళనానికి ఆహ్వానించిన నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పిట్ల రాంగోపాల్, రాష్ట్ర ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జగన్మోహన్, మాజీ రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ పిట్టల రవీందర్, డీఎల్ పాండు, చేన్నవేని రాములు, సిరిసిల్ల జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు చొక్కాల రాములు, చొప్పరి రామచంద్రం, రెడ్డబోయిన గోపి, హనుమండ్లు, వెంకటస్వామి, ముత్యాల శ్రీనివాస్, దేవరాజు, పెద్ద సంఖ్యలో ముదిరాజ్ సోదర సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత చేపపిల్లల సరఫరాలో అవకతవకలు జరగోద్దు

- మత్స్య సొసైటీ అకౌంట్లలో నగదు జమ చేయాలి
- ఎన్ సి డి సి, స్కీమ్ ని కొనసాగించాలి,
- 90 శాతం సబ్సిడీతో మత్స్యకారులకు రుణాలు ఇవ్వాలి
- ఏప్రిల్, మే నెలలో మత్స్యకారుల సమస్యలపై రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు.

సికింద్రాబాద్,విశాలభారతి:
తెలంగాణ ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా 202526 సంవత్సరానికిగాను జలవనరులలో, చెరువులు కుంటల్లో 100% రాయితీ పై ఉచిత చేప పిల్లల పంపిణికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపు స్పష్టంగా ప్రకటించకపోవడాన్ని తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. శుక్రవారం హైదరాబాద్ లోని ముషీరాబాద్ సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మ అధ్యక్షన జరిగింది.
ఈ సమావేశంలో అఖిలభారత మత్స్యకారులు మత్స్య కార్మిక సమాఖ్య జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ మాట్లాడుతూ గత 10 సం.రాల కాలంలో చేప/రొయ్య పిల్లల పంపిణీలో జరిగిన అవకతలపై న్యాయవిచరణ జరిపించాలని, ఈ ఏడాది రాష్ట్రంలో ప్రతి మత్స్య సొసైటీ చెరువుకుంటల్లో కావాల్సినంత చేప రొయ్య పిల్లలను ఉచితంగా పంపిణీ చేయడానికి సొసైటీ ఖాతాలో నగదు జమ చేయాలని
తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్రకమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ఉచిత చేపపిల్లల సరఫరాలో అవకతవకలను నిర్మూలించి మత్స్యకారులకు న్యాయం చయాలని, టెండర్ల ప్రక్రియను రద్దు చేసి మత్స్య సొసైటీ అకౌంట్లలో నగదు జమ చేయాలని, ఈ ఏడాది బడ్జెట్ ను సవరించి మత్స్య పరిశ్రమ అభివృద్ధి మత్స్యకారుల సంక్షేమానికి 5 వేల కోట్లు రూ, కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్ & రాజకీయ బడా బాబుల నుండి చెరువులు కుంటలను రక్షించాలని తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.
ఏప్రిల్ మే నెలలో రాష్ట్ర వ్యాప్తంగా మత్స్య సహకార సంఘాలు చేపల మార్కెట్లలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వేలు అధ్యయనం చేస్తూ ప్రభుత్వ విధానాలపై విస్తృతంగా కరపత్రాలు పంపిణీ చేయాలని సంఘం రాష్ట్ర కమిటీ నిర్ణయించింది,మే నెలలో రాష్ట్రవ్యాప్తంగా మండల జిల్లా స్థాయిలో ఆందోళన చేస్తూ సర్వేలో వచ్చిన సమస్యలు పరిష్కరించాలని అధికారులకు వినతి పత్రాలు ఇవ్వాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది....
మే చివరి వారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వల పై ఒత్తిడి తీసుకురావడానికి భారీ ఆందోళనలు నిర్వహించాలని సంఘం రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మా అధ్యక్షత వహించగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మురారి మోహన్ రాష్ట్ర కార్యదర్శి మునిగల రమేష్ రాష్ట్ర కమిటీ సభ్యులు గాండ్ల అమరావతి,బక్కి బాలమణి,చెన్న వెంకన్న,బి మధు, మామిండ్ల జగదీష్, చెన్న బోయన దర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- అంబేద్కర్ ను అవమానిస్తే ఊరుకునేది లేదు




ఉప్పల్, విశాలభారతి:
బిఆర్ అంబేద్కర్ ను అవమానించేలా పార్లమెంటులో హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తూ కాంగ్రెస్ కేంద్ర పెద్దలు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమానికి పిలుపు ఇచ్చింది.ఏఐసీసీ, టీపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశానుసారం ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లే అవుట్ లోని శ్రీరస్తు కన్వెన్షన్ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉప్పల్ నియోజకవర్గ రియాన్ సన్నాహక సమావేశం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వరెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ శోభారాణి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి విచ్చేసి మాట్లాడారు.అంబేద్కర్ ను, అంబేద్కర్ రాసిన మన రాజ్యాంగాన్ని అవమానించే బీజేపీ, దాని అనుబంధ సంస్థల దాడులను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ అంబేద్కర్ను గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు



## డ్రైనేజీ విధి దీపాల సమస్యలను పరిష్కరిస్తా

- మల్లాపూర్ అధ్యక్షులు కప్పర సాయి

నాచారం,విశాలభారతి:
మల్లాపూర్ 5వ డివిజన్ పరిధిలో ఉన్న నేహూరు నగర్ బ్లాక్ 1,2,3 లలో ఉన్న డ్రైనేజీ మరియు విధి దీపాల సమస్యలను సందర్శించడం జరిగింది. దాదాపుగా 26 స్తంభాలకు విధి దీపాలు వెలగలేకపోవడం చాలా బాధాకరం ఈ సమస్య వాళ్ళ చాలా ఇబ్బంది పారడుతున్నారు అని తెలియజేయడం తో అక్కడ ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలతో సందర్శించిన మల్లాపూర్ 5వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్ ఆ సమస్యను ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. అతి తక్కువ కాలంలో ఆ సమస్యలను పరిష్కరించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మల్లు భాయ్, సతీష్, వర్మ, శ్రావణి గౌడ్, అఖిల, జయంత్, ప్రణీత్ కవిత మరియు బస్తీ వాసులు పాలుగోన్నారు.



## ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, విశాలభారతి:
ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.శుక్రవారం రామంతపూర్ ఇందిరా నగర్ లో 85 లక్ష రూపాయల నిధులతో సీసీ రోడ్ నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ షార్ట్ సర్క్యూట్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:
హయత్ నగర్ డివిజన్లోని భూలక్ష్మి నగర్ కమ్యూనిటీ హాల్ లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల సీసీ కెమెరాల పరికరాలు మొత్తం కాలిపోవడం వాళ్ళు జరిగిందని సమాచారం రావడంతో, స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు, ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నవజీవన్ రెడ్డి తెలపడంతో పాటు, కాలనీలోని సమస్యలు మరియు చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలను కాలనీ వాసులను అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కాశీపతి , సంక్షేమ సంఘం సభ్యులు రవి కిరణ్ , శ్రీధర్, దామోదర్ రెడ్డి , గంగాధర్ , సత్యనారాయణ , శ్రీనివాస్ మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.








# ఘనంగా అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలు

- తరలివచ్చారు విద్యార్థులు

విశాలభారతి, ఓయూ:
నాట్యం, సంగీతం, నాటకం, సాహిత్యం సహా ఇతర ఫైన్ ఆర్ట్స్ విభాగాలకు చెందిన విద్యార్థులకు శుక్రవారం ఠాగూర్ ఆడిటోరియంలో 2024 2025 విద్యాసంవత్సర ఉస్మానియా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీల్లో పాల్గొనేందుకు ఆయా కళాశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీల్లో ఓయూ పరిధిలోని 188 కళాశాలల నుంచి దాదాపు 900 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలను ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమాలను కేవలం సాంస్కృతిక పోటీలుగానే చూడొద్దని, సాంస్కృతిక పోటీలు విద్యార్థుల్లో ఐక్యత, సమయస్ఫూర్తి, జాతీయ భావం, సహనశక్తిని పెంచుతాయని అన్నారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడుతాయని వివరించారు. విభిన్న రంగాల్లో విద్యార్థుల నైపుణ్యాలు భవిష్యత్తు నాయకత్వాన్ని పెంపొందిస్తాయని గుర్తు చేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృతనాత్మకత, నైపుణ్యాలను వెలికితీసే వేదిక ఓయూ గా అభివర్ణించారు. అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులంతా ఠాగూర్ ఆడిటోరియం వేదికగా, తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని, ఓయూ ఔన్నత్యాన్ని దశదిశలా చాటాలని పిలుపునిచ్చారు.ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ బి. రాజేంద్ర నాయక్, యూజీసీ వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ బి. లావణ్య, యూత్ వెల్ఫేర్ అధికారులు ప్రొ. ఎస్. కవితా దేవి, ప్రొ. లింగప్ప, సలహా కమిటీ సభ్యులు జి. ప్రభాకర్, ప్రొ. విద్యాసాగర్, ప్రొ. బి. మంజులా, ప్రొ. ఎ. ప్యాట్రిక్, డాక్టర్ ఎస్. సుశీలా, డాక్టర్ వి. సమున్నత, ఇతర అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.దీనితో అక్కడ విద్యార్థులు కేరింతలు కొట్టారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శనివారం,
05.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



# కూకట్పల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

కూకట్పల్లి,విశాలభారతి:



శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించు కొని కుకట్పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు.సీతారాముల చిత్రపటానికి వేద మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ.సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యక్షులు భీమయ్య, కార్యదర్శి హర్ష వర్ధన్ రెడ్డిల తో పాటు కార్యవర్గ సభ్యులు,సీనియర్ న్యాయవాదులు,మహిళా న్యాయవాద ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు

## ఆర్థిక సహాయం అందజేత

బాల్కొండ,విశాలభారతి

భీమ్గల్ మండలంలోని చెంగల్ గ్రామంలో శ్రీ లక్ష్మీ గ్రామ మహిళా సమైక్య సమావేశం నిర్వహించడం జరిగిందని ఇందులో భాగంగా జీవనజ్యోతి మహిళా సంఘంలోని సభ్యురాలైన తలారి శారద ఇటీవలే మరణించారు.అయితే వల కూతురు రోషియాకి ఐకెపి సిసి గడాల రఘుపతి రూ.5వేల ఆర్థిక సహాయంతో పాటు నెలకు సరిపడే వంట సామాగ్రి బియ్యం, పప్పులు,నూనె,అందజేశారు.దీనికి సహకరించినటువంటి మహిళా సంఘాల సభ్యులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళా సంఘం ప్రతినిధిలు, వివోలు, అధ్యక్షురాలు సంగెం స్రవంతి, లక్ష్మి,రూప,పల్లికొండ లక్ష్మి, వివోఎ చేవ్వ సునీత,మహిళలు, తదితరులు పాల్గొన్నారు.




# కొనసాగుతున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

విశాలభారతి, భీమదేవరపల్లి :

భారతరాజ్యాంగం పట్ల ఢిల్లీ పార్లమెంటులో అనుచిత వాఖ్యలను ఖండిస్తూ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్.. రాజ్యాంగ పరిరక్షణ యాత్రను అనుసరిస్తూ, భీమదేవరపల్లి మండలంలో అధ్యక్షులు చిట్టంపల్లి ఐలయ్య, ఇంచార్జీ కొలిపాక నరేష్ అధ్యర్యంలో శుక్రవార ధర్మారం, చంటయ్యపల్లి, కొత్తకొండ గ్రామాల్లో యాత్ర కొనసాగింది. పార్టీ శ్రేణులతో కలిసి పాదయాత్ర చేస్తూ, ప్రజలను కలుస్తూ, వారి సమస్యలను తెలుసుకుంటూ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఈ 16 నెలల్లో చేసిన, ఇచ్చిన సంక్షేమ పథకాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, మాజీ మండల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కబ్జాలకు గురి అవుతున్న ప్రభుత్వ భూమిని రక్షించాలి

- సిపిఎం పార్టీ అబ్దుల్లాపూర్మెట్ మండల కార్యదర్శి నరసింహ
- అబ్దుల్లాపూర్మెట్ మండల ఎమ్మార్వో కి వినతి పత్రం

పెద్ద అంబర్ పేట్,విశాలభారతి:



పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ అన్నారం గ్రామంలో ప్రభుత్వ భూములు సర్వే నెంబరు 26,73,127 కబ్జాలకు గురి అవుతున్న భూములను రక్షించాలని, గ్రామంలో ఉన్న చెరువులను కుంటలను రక్షించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్మెట్ తాసిల్దార్ కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ అబ్దుల్లాపూర్మెట్ మండల కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ తట్టి అన్నారం గ్రామంలో సర్వేనెంబర్ 26 ,73,127 ప్రభుత్వ భూములు గత పది సంవత్సరాల నుండి రెవిన్యూ అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, రాజకీయ నాయకులు కబ్జాలు చేస్తూ ఆక్రమిస్తున్న కూడా పెడచెవున పెడుతున్నారని వాపోయారు. కావున వెంటనే కబ్జాలకు గురైనటువంటి ప్రభుత్వ భూమిని సర్వే చేసి కబ్జాదారుల నుంచి రక్షించి పెన్సింగ్ వేసి ప్రభుత్వ భూమిని రక్షించాలని పేర్కొన్నారు.చెరువు కుంటలను కబ్జాదారుల నుంచి రక్షించుట గురించి...తట్టి అన్నారం గ్రామంలో ఊర చెరువులో ఇప్పటికీ కబ్జా చేసి ప్లాట్లుగా మార్చుకొని ఇండ్లను కూడా నిర్మిస్తున్నారు, చెరువులోకి నీరు రాగానే అలుగులను తొలగించి తూములను తీసి నీరు నిలువ లేకుండా చేస్తున్నారు అయినా కూడా ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని, తట్టి కాన చెరువు ఎఫ్ టి ఎల్ లో మట్టి పోసి చెరువులు పూర్తి పూడ్చి వేస్తున్నారని, జంగా రెడ్డి కుంట ఇప్పటికే జై కన్వెన్షన్ వాళ్లు పూడ్చి వేస్తే అనేక ఆందోళనలు పోరాటాల చేయడం వల్ల చెరువులో నుండి మట్టిని తీయించడం జరిగిందని అన్నారు, అయిన కూడ మల్ల చెరువులు పూడ్చివేస్తూన్నారు, అదేవిధంగా గాలకుంట కుమ్మరి కుంట పూర్తిగా విధ్వంశం చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ఇండ్లు నిర్మిస్తున్నారు అని నగరంలో ఉన్న చెరువులు కుంటలు రక్షిస్తారని ప్రజలు భరోసాతో ఉన్నారు కానీ హైడ్రా కూడా రాజకీయ నాయకుల బందిగా మారిందని కావున వెంటనే ఇట్టి చెరువుల ను కుంటలను రక్షించి ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్ గా గుర్తించి హద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని సిపిఎం పార్టీ తరపున కోరడం జరుగుతుందని అన్నారు, తట్టి అన్నారం మత్తుగూడ సర్వేనెంబర్ 117 ప్రభుత్వ భూమిలో కొంతమంది వ్యాపారస్తులు కబ్జా చేసి కమర్షియల్ షెడ్యూల్ నిర్మిస్తున్న అధికారులు చూసి చూడనట్లు ఉంటున్నారని కావున వెంటనే ప్రభుత్వ భూములను చెరువులను కుంటలను సర్వే చేసి హద్దురాళ్ళు పాతి రక్షించాలని సిపిఎం పార్టీ తరపున డిమాండ్ చేయడం జరుగుతుంది, లేనియెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంబంధిత కార్యాలయాలను ముట్టడి చేస్తామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు గుండె శివకుమార్, వర్కల ముత్యాలు, పారంద శీను, ఎం శ్రీశైలం ఆలేటి ఆటం ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.



# రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వినయ్ రెడ్డి

ఆర్మూర్ ,విశాలభారతి:

ప్రతి ఒక్కరు భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అని పొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి తెలిపారు. నందిపేట్ మండలంలోని చిమ్రాజ్ పల్లి, లక్కంపల్లి గ్రామాలలో శుక్రవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా అందరికీ సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలను కాపాడుకుందామని అన్నారు. 30 రాష్ట్రాలు, ఏడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 5,97,608 గ్రామాలలో మరియు 7,933 పట్టణాలలో నివసిస్తున్న ప్రజలు భిన్నత్వంలో ఏకత్వంతో కలిసిమెలిసి ఉంటుంది జీవితాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. పార్టీ జెండా ఆవిష్కరించి పాదయాత్ర నిర్వహించారు, వార్డులలో సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం నుండి నిధులు తెప్పించి అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మంద మహిపాల్, సొసైటీ చైర్మన్లు సుదర్శన్,బొంకం గంగారెడ్డి, కొమిరె ముత్తెన్న ,లక్ష్మణ్, పోతన్న ,రాము, లక్ష్మణ్, ముత్యం, సిలిండలింగం, గంగాధర్ పాల్గొన్నారు



# ధాన్యం కోనుగోలు కేంద్రాలు ప్రారంభం

బాల్కొండ,విశాలభారతి:

భీమ్గల్ మండలం బాబాపూర్, మెండోరా గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళ సంఘాల ఆధ్వర్యంలో ప్రారంభించారు.బాబాపూర్ గ్రామంలో కమ్మర్ పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిష్టి చిన్నరెడ్డి, మెండోరా గ్రామంలో ఎంపీడీఓ గంగుల సంతోష్ కుమార్ ఐకెపి సిబ్బందితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కమ్మర్ పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిష్టి చిన్నరెడ్డి మాట్లాడుతూ...రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులు పండించే పంటను 100% కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులు ఎవరు అధైర్య పడకుండా దళారులకు అమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ గంగుల సంతోష్ కుమార్ మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలని, ఎలాంటి తప్పా తాలు లేకుండా చూసుకోవాలని,కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్న ఐకెపి మహిళాలకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిఎల్పిఓ శివకృష్ణ,ఎపిఎం రవీందర్, సిసిలు శ్రీనివాస్,నరేష్,కార్యదర్శులు,కాంగ్రెస్ నాయకులు కుంట రమేష్, పల్లె శేఖర్,రాడే మురళీ,గంగా బాపు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో ఐక్య ఉద్యమాలకు కృషి చేస్తున్నాం

- ప్రజా, వర్గ పోరాటాలను విస్తృత పరుస్తాం
- ఎర్ర జెండాకు పూర్వ వైభవాన్ని సాధిస్తాం.
- సిపిఐ(ఎం ) అఖిలభారత 24వ మహాసభలో మల్లు లక్ష్మి..

సూర్యాపేట,విశాలభారతి:



తెలంగాణ రాష్ట్రంలో మతోన్మాద బిజెపిపై పోరులో లౌకిక పార్టీలుగా ఉన్న కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు మెతక వైఖరి అవలంబిస్తున్నాయని, తెలంగాణ రాష్ట్రంలో బిజెపి ప్రమాదాన్ని నివారించేందుకు ఐక్య ఉద్యమాలకు కృషి చేస్తున్నామని సిపిఐ(ఎం ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. శుక్రవారం తమిళనాడు రాష్ట్రంలోని మధురై నగరంలో జరుగుతున్న సిపిఐ (ఎం )24వ అఖిలభారత మహాసభలో తెలంగాణ రాష్ట్ర ప్రతినిధిగా ఆమె పాల్గొని తెలంగాణ రాష్ట్ర రాజకీయాలలో సిపిఎం చేస్తున్న కృషిని వివరిస్తూ మాట్లాడారు. విభజన హామీలు అమలు విషయంలో తెలంగాణకు రావలసిన నిధుల విషయంలో అందరినీ కలుపుకపోవడంలో కాంగ్రెస్ పార్టీ ముందుకు రావడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వామపక్షాలను కూడగట్టేందుకు సిపిఐ (ఎం) నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రత్యామ్నాయ ప్రజా అనుకూల ఏజెండాలో లెఫ్ట్ పార్టీలో ఒక కార్యాచరణ రూపొందించుకొని ముందుకు పోయేందుకు చొరవ చూపుతున్నాయని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాలుగున్నర లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు సాధించినది వామపక్ష పార్టీలు అన్నారు. హెచ్ సి యు భూములు రాష్ట్ర ప్రభుత్వం అమ్మడాన్ని కి వ్యతిరేకంగా, రామోజీ ఫిలిం సిటీ ఆక్రమించుకున్న భూములకు సాధనకు సిపిఐ(ఎం) నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రజా, వర్గ పోరాటాలను తెలంగాణ రాష్ట్రంలో ఉధృతంగా నిర్వహిస్తూ స్వాతంత్ర కార్యాచరణతో పాటు ఐక్య కార్యాచరణ ఉద్యమాలను లెఫ్ట్ పార్టీలుగా, మరికొన్ని విషయాలలో లౌకిక పార్టీలుగా ముందుకు వెళ్తామన్నారు. హిందుత్వ కార్పొరేట్ దోపిడి శక్తుల దోపిడి విధానాలను ప్రజలకు వివరిస్తూ సమీకరిస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వామపక్ష ఐక్యతకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో సిపిఐ(ఎం ) పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు.

# ఎన్ హెచ్ ఆర్ సి. సూర్యాపేట పట్టణ అధ్యక్షులుగా నెల్లుట్ల వెంకటేశ్వరరావు

- నియామకం పత్రం అందించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య.

సూర్యాపేట,విశాలభారతి



జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) సూర్యాపేట పట్టణ అధ్యక్షులుగా సూర్యాపేట కు చెందిన నెల్లుట్ల వెంకటేశ్వరరావు ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య నియామక పత్రం అందించినట్లు సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు పిడమర్తి నాగేశ్వరి జిల్లా ప్రధాన కార్యదర్శి మేహేందికార్ సందీప్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ బలమైన లీగల్ ప్రొసీజర్ తో ముందుకు పోతున్న జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు పనిచేయాలని ఆదేశించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా నెల్లుట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య సార్,జిల్లా అధ్యక్షురాలు పిడమర్తి నాగేశ్వరి,ప్రధాన కార్యదర్శి మేహేందికార్ సందీప్,ఉపాధ్యక్షులు కోటాచారి,జిల్లా అధికార ప్రతినిధి నామ వేణు లకు కృతజ్ఞతలు తెలిపారు.తన పదవిని నిజాయితీగా నిర్వహిస్తానని ఆయన తెలిపారు.



# కాంగ్రెస్ శాలువాతో సత్కరించిన విశ్వబ్రాహ్మణ సంఘం విశ్వకర్మ సంఘీవులు మాటూరి రమేష్

- ఆరేపల్లి గ్రామ విలేజ్ ప్రెసిడెంట్ సుదర్

విశాల భారతి, ఎల్కతుర్తి:

హుస్నాబాద్ నియోజకవర్గంఎల్కతుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామం నుండి , గుంటూరుపల్లి మరియు ఆరెపల్లి గ్రామాలలో జైబాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మండల కాంగ్రెస్ నాయకులకు మండలంలోని అన్ని గ్రామాల నాయకులకు మహిళ నాయకురాలకు నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు . మాటూరి రమేష్ విశ్వబ్రాహ్మణ సంఘం విశ్వకర్మ కాంగ్రెస్ నాయకులు మాటూరు రమేష్ మండల నాయకులకు శాలువాతో ఘనంగా సత్కరది కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ ఫలాలతో ముందుకు దూసుకు వెళ్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆరేపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు మాటూరి సుదర్శన్. ఆధ్వర్యంలో మాటూరి రమేష్ ఎల్కతుర్తి మండల పార్టీ అధ్యక్షులు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి. మాజీ అధ్యక్షులు సుకినే సంతాజి. టిపిసిసి సభ్యులు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి. వారికిజై బాపు. జై భీమ్. జై సంవిధాన్. ఇంచార్జి కృష్ణారెడ్డికి ఘనంగా శాలువాతో సత్కరించారు ఈ సందర్భంగా మాటూరి రమేష్ ని శాలువాతో సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ఇంచార్జ్ కృష్ణారెడ్డి నాయకులకు కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు



# గ్రూప్ 1 ఉద్యోగం సాధించిన మల్లేష్ యాదవ్

ఆమనగల్లు,విశాలభారతి:

ఆమనగల్లు మున్సిపాలిటీ 6 వార్డ్ గుర్రం గుట్ట కాలనీకి చెందిన వ్యవసాయదారులైన కావటి యాదయ్య, పార్వతమ్మ కుమారుడు కావటి మల్లేష్ యాదవ్ ఇప్పటికే మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై తన ప్రతిభను చాటుతున్నాడు.వెలువడిన గ్రూప్ 1 మెరిట్ లిస్టులో రాష్ట్రస్థాయిలో 187వ ర్యాంకు, మల్టీజోన్ 2 విభాగంలో 92వ ర్యాంకు సాధించాడు. ఉన్నత ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో గ్రూప్ 1 లో కష్టపడి ఉత్తమ ర్యాంకు సాధించడం పట్ల ఆమనగల్ గుర్రం గుట్ట కాలనీకి చెందిన కావటి మల్లేష్ యాదవ్ కు6 వార్డ్ గుర్రం గుట్ట మాజీ కౌన్సిలర్ దివ్య శ్రీకాంత్ సింగ్ ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వార్డు బిజెపి నాయకులు మల్లయ్య,శ్రీశైలం యాదవ్,గుజ్జరి శ్రీను , లింగం, బ్రహ్మం, శ్రీనివాస్ చారి, శీను, బాలకృష్ణ,కాలనీ వాసవులు నాయకులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
05.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## యాదగిరి క్షేత్రంలో కన్వెన్షన్ హాల్

యాదగిరిగుట్ట ,విశాలభారతి :యాదగిరిగుట్ట పంచనారసింహుల పుణ్యక్షేత్రంలో శుభకార్యాలు, సమావేశాల నిర్వహణకు ప్రత్యేక కన్వెన్షన్ హాల్ ఏర్పాటైంది. క్షేత్రాభివృద్ధిలో భాగంగా వైటీడీప ఆధ్వర్యాన అధునాతన హంగులతో ప్రత్యేక ఫైబర్ షీట్ల ద్వారా హాల్ నిర్మితమైంది. 150 మంది పాల్గొనేలా చైర్లు ఏర్పాటు చేశారు. ఒక రోజుకు రూ.85,800 అద్దె చెల్లిస్తే హాల్ పక్కనే ఉన్న ఐదు గెస్ట్‌హౌస్‌లతో కూడిన విల్లా కేటాయిస్తామని వైటీడీప ని-ర్వాహకులు తెలిపారు. కొండ కింద ఆధ్యాత్మికవాడ సమీపాన ఉన్న ప్రెసిడెన్షియల్ సూట్ సముదాయంలోని 14 విల్లాలు సైతం యాత్రికులకు రోజు వారి అద్దెకిస్తారు. ఒక్కో విల్లాలో ఐదు గెస్ట్‌హౌస్‌లు ఉంటాయి. ఒక గెస్ట్‌హౌస్‌కు రూ.3వేలు అద్దె చెల్లించాలి. ఆన్‌లైన్‌లో లేదా నేరుగా గెస్ట్ హౌస్ బుక్ చేసుకోవచ్చు. స్వయంభూ యాదిగిరి క్షేత్రంలో వివాహాలు, కాన్ఫరెన్స్, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకుని పంచ నారసింహుల దివ్యాశీస్సులు పొందే అవకాశం కల్పించేందుకు ఈ వసతి ఏర్పాటు చేసినట్లు వైటీడీప చెబుతోంది.



# పూర్వ విద్యార్థుల కళాయిక

- 24 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వపు విద్యార్థులు

ఆమనగల్లు,విశాలభారతి : ఆనందం, ఉద్వేగం,ఆప్యాయత పలకరింపులు చిన్ననాటి జ్ఞాపకాలు చిలిపి ముచ్చట్లు సెల్ఫీలు మధురమైన జ్ఞాపకాలతో ఆ ప్రాంతమంతా సందడిగా నెలకొంది. 24 ఏళ్ల తర్వాత బాల్యమిత్రులు ఒకచోట కలుసుకోవడం చెప్పుకోలేని మధుర అనుభవం.కడ్తాల్ మండల పరిధిలోని జడ్.పి.హెచ్.ఎస్ కడ్తాల్ లో పదోవ తరగతి 20012002 బ్యాచ్ విద్యార్థులు 24 సంవత్సరాల తర్వాత శుక్రవారం ఆత్మీయ పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మైసిగండి షైన్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన అనంతరం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకోవడంతో వారి సంతోషాలకు అవధులు లేకుండా పోయాయి.ఈ సందర్భంగా విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆత్మీయంగా పలుకరించుకున్నారు. పదో తరగతి పూర్తి చేసిన తర్వాత ఉన్నత చదువుల కోసం దూరమయ్యారు. మళ్లీ ఇన్నేండ్ల తర్వాత కలుసుకున్నారు. ఆ పూర్వ విద్యార్థులు మైసిగండిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి, అలనాటి స్మృతులను నెమరేసుకుంటూ ఒకరిని ఒకరు ఆటపట్టిస్తూ యోగక్షేమాలు తెలుసుకుంటూ రోజంతా సరదాగా గడిపారు.పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, రెండు దశాబ్దాలు గడిచిన అందరు స్నేహితులు కలువాలనే ఉద్దేశంతో ఆత్మీయ సమ్మేళన వేదిక ఏర్పాటు చేసినట్లు కడ్తాల్ వైస్ ఎంపిపి బావండ్లపల్లి ఆనంద్ తెలిపారు. 24 సంవత్సరాల క్రితం పదవ తరగతి పరీక్షలు వ్రాసి కొందరు పై చదువుల కొరకు వేరువేరు పట్టణాలకు, మరికొందరు జీవనాధారం కోసం ఏదో పని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కొందరు ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగం చేస్తున్నారు. మరికొందరు వ్యాపార రంగాల్లో స్థిరపడి జీవనం సాగిస్తున్నారు. మరికొందరు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. చాలా సంవత్సరాల తర్వాత దాదాపు అందరూ స్నేహితులు కలవడం చాలా ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో అనేక సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించారు. అనంతరం ఆనాటి గురువులను సత్కరించారు.ఈ కార్యక్రమంలో నాడు బోధించిన ఉపాధ్యాయులు నిరంజన్, వీరారెడ్డి, ఈశ్వరయ్య, మాధవరెడ్డి, జగత్ రెడ్డి, పాండయ్య, రామనాథం ,అశోక్ రెడ్డి, శ్రీనివాస్ హాజరై పూర్వ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

# ప్రభుత్వ ఉద్యోగిని కొట్టి కేసులో ఒకరికి జరిమానా

బాల్కొండ,విశాలభారతి: ప్రభుత్వ ఉద్యోగిని కొట్టి, గాయపరిచిన నిందితునికి జరిమానా విధిస్తూ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి దీప్తి వేముల శుక్రవారం తీర్పు వెలువరించారు. మెండోరా ఎస్సై జీ.నారాయణ తెలిపిన వివరాల ప్రకారం...2019 సంవత్సరంలో మెండోరా మండలం పోచంపాడ్ గ్రామానికి చెందిన బండారి మోహన్ సింగ్ అలియాస్ రాహుల్ అను వ్యక్తి అదే గ్రామంలో ఎఎల్ఎంగా విధులు నిర్వహిస్తున్న యండి. ఆరిఫ్ హుస్సేన్ డ్యూటీలో ఉన్న సమయంలో అనవసరంగా అతనితో గొడవ పెట్టుకుని నిందితుడు తన చేతికి ఉన్న కడియంతో యండి.ఆరిఫ్ హుస్సేన్ ను కొట్టి గాయపరిచాడని మెండోరా పోలీస్ స్టేషన్ లో కేసు పెట్టగా అప్పటి ఎస్సై ఎం.కృష్ణమూర్తి కేసు నమోదు చేసి ఆర్మూర్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.ఎపిపి జి.రామకృష్ణ సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో ప్రథమ శ్రేణి న్యాయమూర్తి దీప్తి వేముల నిందితునికి రూ.5వేల జరిమానా విధించారు. కోర్టులో సాక్ష్యులను ప్రవేశపెట్టడం లో సహకరించిన కోర్టు డ్యూటీ అధికారి ఎస్.నరేష్‌ను మెండోరా ఎస్సై అభినందించారు.



# బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయండి

- ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్

విశాలభారతి, ఎల్కతుర్తి ఈ సందర్భంగా సత్య సాయి గార్డెన్ లో ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సతీష్ కుమార్ మాట్లాడుతూ ఎల్కతుర్తి మండల కేంద్రంలోని చింతలపల్లి వద్ద ఈనెల 27 న జరగబోయే భారీ బహిరంగ సభకు లక్షలాదిమంది వస్తున్న సందర్భంగా స్థానిక మండల నాయకులు కార్యకర్తలు సభ స్థలాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు కాంగ్రెస్ పార్టీ పైన వ్యతిరేకతతో జనం ఉన్నందున సభ భారీ ఎత్తున సక్సెస్ అయ్యే అవకాశం ఉన్నది రాష్ట్రం నాలుగు మూలల నుంచి వచ్చే కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పార్కింగ్ సౌకర్యం అన్ని విధాల సౌకర్యాలు చేస్తున్నట్లు తెలిపారు ఎల్కతుర్తి మండలం కేంద్రం నుండి అన్ని గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా బహిరంగ సభకు తరలి రావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు సభ కోసం భూములు ఇచ్చిన చింతలపల్లి రైతులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పిట్టల మహేందర్ భీమదేవరపల్లి మండల అధ్యక్షులు మండల సురేందర్ సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్ సింగిల్ విండో వైస్ చైర్మన్ శేషగిరి మాజీ ఎంపీపీ తంగేడ శాలిని మహేందర్ మాజీ వైస్ ఎంపీపీ తంగెడ నగేష్ రైల్వే బోర్డు సభ్యులు యేల్తూరీ స్వామి మాజీ ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు కడారి రాజు మాజీ మండల అధ్యక్షులు పోరెడ్డి రవీందర్ రెడ్డి రాష్ట్ర నాయకులు గోల్లె మహేందర్ బిఆర్ఎస్వి నియోజకవర్గ ఉపాధ్యక్షులు గోడిశాల వినయ్ గౌడ్ మండల యూత్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి సోషల్ మీడియా ఎల్కతుర్తి మండల అధ్యక్షులు గుండేటి సతీష్ నేత మండల ప్రధాన కార్యదర్శి జూపాక జడ్సన్ మండల యూత్ ఉపాధ్యక్షులు ఈర కమలాకర్ బీసీ సెల్ మండల అధ్యక్షులు చెవుల తిరుపతి ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు సాతూరి శంకర్ మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు మదార్ జాగృతి మండల అధ్యక్షులు విక్రమ్ గౌడ్ వోడితల యువసేన అధ్యక్షులు చిట్టి గౌడ్ మండల సీనియర్ నాయకులు దేవేందర్రావు సాంబమూర్తి గౌడ్ రాజేశ్వరరావు అల్లకొండ రాజు వెంకటేష్ యాదవ్ ప్రేమ్ సాగర్ రావు చదిరం నాగేశ్వర్ బాబు రావు జంగం రాజు వేముల సమ్మయ్య దుగ్యాని సమ్మయ్య ప్రసాద్ చెవుల కొమురయ్య కమలాకర్ రావు సాతూరి చంద్రమౌళి సతీష్ శివాజీ బాబు వేముల శ్రీనివాస్ కోరే రాజ్ కుమార్ వలి పాషా డెంగు రమేష్ మొగిలి అంబాల రాజ్ కుమార్ స్వామి రావు మోహన్ రెడ్డి రామ్ రెడ్డి యూత్ నాయకులు శ్రీకాంత్ యాదవ్ సాంబరాజు నవీన్ రావు కొంగ ప్రవీణ్ సతీష్ పుట్కూరి కార్తీక్ మురళి నవీన్ రంజిత్ గౌడ్ అనిల్. భగవాన్ గౌడ్ సందెల నరేష్ అంచన గిరి స్వామి. మహిళా నాయకులు క్రిష్ణ వేణి భాగ్య తదితరులు పాల్గొన్నారు

# వక్ఫ్ స్థలాలను కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు కట్టబెట్టే కుట్ర

- ఆమోదం పొందిన వక్ఫ్ బిల్లును వెంటనే రద్దు చేయాలి.
- వక్ఫ్ బచావో కల్వకుర్తి నియోజకవర్గ సభ్యులు.
- ఆర్డీఓకు వినతిపత్రం అందజేత.




అమనగల్లు,విశాలభారతి : పేద ముస్లీంలకు దక్కాల్సిన వక్ఫ్ బోర్డు ఆస్తులను పెట్టుబడిదారుల కట్టబడేందుకు కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లును తెరపైకి తీసుకువచ్చి పార్లమెంట్ లో ఆమోదింపజేసిందని వెంటనే వక్ఫ్ బిల్లును రద్దు చేయాలని వక్ఫ్ బచావో కల్వకుర్తి నియోజకవర్గ కోఆర్డినేటర్స్ సయ్యద్ మసూద్,షేక్ ఏజాస్,జహీర్,అబ్దుల్ ఖాదర్, మోక్తదర్,లు పేర్కొన్నారు. శుక్రవారం ప్రార్థనల అనంతరం కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ తీరును నిరసిస్తూ కల్వకుర్తి పట్టణంలోని జామా మసీదు నుండి వక్ఫ్ బచావో కల్వకుర్తి నియోజకవర్గ కోఆర్డినేటర్ల ఆధ్వర్యంలో ముస్లీం మత గురువులు,యువకులు మహబూబ్ నగర్ చౌరస్తా వరకు పెద్దఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ముస్లీం యువకులు రోడ్డుపై బైఠాయించి పార్లమెంట్ లో ఆమోదం పొందిన వక్ఫ్ బిల్లును కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి ప్రధాని నరేంద్ర మోడీ,కేంద్ర హోంమంత్రి అమిత్ షా,ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, బీహార్ సీఎం నితీష్ కుమార్, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్,ల దిష్టిబొమ్మలను దహనం చేశారు.అనంతరం ఎన్డీఏ ప్రభుత్వం వక్ఫ్ బిల్లును రద్దు చేయాలని కోరుతూ వక్ఫ్ బచావో కల్వకుర్తి నియోజకవర్గ కోఆర్డినేటర్లు పట్టణంలోని రాజస్వ మండల అధికారి కార్యాలయంలో ఆర్డీఓ శ్రీనునాయక్ వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ బిల్లు ఆమోదం పొందడం వల్ల మత స్వేచ్ఛ సమానత్వానికి హామీ ఇచ్చే రాజ్యాంగంలోని 14,25, 26 ఆర్టికల్స్ ఉల్లంఘనతో పాటు మతపరమైన స్వేచ్ఛలో జోక్యం చేసుకోవడం ముస్లీంల రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని అన్నారు.వక్ఫ్ బిల్లు చట్టరూపం దాల్చినట్లయితే మసీదులు, ఈద్గాలు,దర్గాలు,అషూర్ ఖానాలు,స్మశాన వాటికలు వంటి మతపరపైన ప్రదేశాలతో సహా వక్ఫ్ ఆస్తులకు తీవ్ర ముప్పు ఏర్పడుతుందని పేర్కొన్నారు.కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వక్ఫ్ బోర్డుల అధికారాన్ని నిర్వీర్యం చేయడంతో వక్ఫ్ ఆస్తులను కబ్జాదారులకు రెగ్యులర్ చేసుకోవడానికి మార్గం సుగమం చేస్తుందని మండిపడ్డారు.వక్ఫ్ బిల్లును ప్రస్తుత ప్రతిపక్ష ఇండియా కూటమినేతలు,ముస్లీం పర్సనల్ లా బోర్డుతో పాటు దేశంలోని వివిధ ముస్లీం సంఘాలు,ప్రజా మేధావి సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. పార్లమెంట్ లో ఆమోద ముద్రపడ్డ వక్ఫ్ బిల్లును కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో మత గురువులు వకీల్ మౌలానా, ఓవైజ్ మౌలానా ,అమీర్ మౌలానా,లతో పాటు వక్ఫ్ బచావో కల్వకుర్తి కమిటీ సభ్యులు పప్పు,మక్బూల్, విక్కీ,హాజి,ఖాదర్,సోఫీ, సలాం,సోహెల్,ఆరీఫ్,అఖిల్,ఖదీర్,షారూక్ ఖాన్, అబుబాకర్, తదితరులు పాల్గొన్నారు.



# సఖి అవగాహన కార్యక్రమం

- ఎల్కతుర్తి మండల్ వల్బాపూర్ గ్రామంలో అవగాహన కార్యక్రమం

విశాలభారతి, ఎల్కతుర్తి: హనుమకొండ,వివో కమ్యూనిటీ హాల్ లో మహిళ శిశు సంక్షేమ శాఖ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.సఖి యొక్క ముఖ్య ఉద్దేశాలు అందించిన సేవలను తెలియజేయుటకు సఖి లీగల్ అడ్వైజర్ మేడం శ్రీదేవి , కేస్ వర్కర్ అనూష ,పాల్గొని సఖి సెంటర్ యొక్క ముఖ్య ఉద్దేశాలు అందించిన సేవలను వివరించారు. ఐదు రకాల సేవలను గురించి తెలుపుతూ కౌన్సిలింగ్ సహాయం వైద్య సహాయం పోలీస్ సహాయం తాత్కాలిక వసతి న్యాయ సహాయం ఐదు రకాల సేవలను గురించి తెలుపుతూ చట్టాలపై ప్రతి ఒక్క మహిళలకు అవగాహన ఉండాలని చెప్పడం జరిగింది సఖి సెంటర్ యొక్క ముఖ్య ఉద్దేశాలు తెలుపుతూ గృహ హింస లైంగిక వేధింపులు పనిచేసేచోట వేధింపులు అత్యాచారాలు ఇలాంటి రక్షణ పొందడానికి సఖి సెంటర్ పనిచేస్తుందని చెప్పడం జరిగింది సఖి సెంటర్ సిబ్బంది 24 గంటలు పని చేస్తామని సమస్య ఉన్నప్పుడు 181 మహిళ హెల్ప్ లైన్ నెంబర్ కు కాల్ చేయడం ద్వారా తక్షణ సహాయం రక్షణ లభిస్తుందని అదేవిధంగ 08702452112, 7382983088 అనే నెంబర్ లకు కాల్ చేయడం ద్వారా బాధిత మహిళలకు సహాయం అందించబడుతుంది తెలిపారు.ఈ సదస్సులో వి వో ఏ రజిత ఎస్ హెచ్ జి గ్రూప్ లీడర్స్ మెంబర్స్ లు పాల్గొన్నారు.




# రాజ్యాంగ పరిరక్షణ యాత్ర విజయవంతం

విశాలభారతి, ఎల్కతుర్తి జై బాపు! జై భీమ్!! జై సంవిధాన్!! ఎల్కతుర్తి మండలం లోని తిమ్మాపూర్. గుంటూరుపల్లి, ఆరెపల్లి , గ్రామ లలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి. ఆధ్వర్యంలో జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎల్కతుర్తి మండల కోఆర్డినేటర్ అనిమిరెడ్డి కృష్ణారెడ్డి గారు హాజరు అయ్యారు పీసీసీ సభ్యులు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి సింగల్ విండో డైరెక్టర్ ముప్పు మహేందర్. గ్రామ శాఖ అధ్యక్షులు, భాస్కర్, నాగేందర్, సుదర్శన్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అంబాల శ్రీకాంత్. బక్కి ఉపధ్యక్షులు భీమ్రాజ్. ఈ కార్యక్రమం లో ముఖ్యులు పార్టీ నాయకులు సీనియర్ నాయకులు వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు కార్యకర్తలు యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# వేసవికాలంలో నడుస్తున్న ఇంటర్ కళాశాలలను మూసివేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి



విశాలభారతి,హైదరాబాద్: ఇంటర్ విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా విద్యార్థులను మానసిక ఆందోళనకు గురిచేస్తున్న ఇంటర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా ప్రవేట్ కార్పోరేట్ కళాశాలలో క్లాసులు నిర్వహిస్తున్నారని ఇంటర్మీడియట్ బోర్డు జూన్ ఒకటో తారీకు వరకు సెలవులు ప్రకటించిన వేసవి కాలంలో క్లాసులో నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకుంటామని సర్క్యులర్ ఇచ్చిన కార్పొరేట్ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలను పట్టించుకోకుండా విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా క్లాసులు నిర్వహిస్తున్నయని తెలిపారు.తక్షణమే ఆయా కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. క్లాసులు నిర్వహిస్తున్నారని ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులకు తెలియజేసిన బోర్డు అధికారులు అట్టి కళాశాలపై చర్యలు తీసుకోకపోవడం కరెక్ట్ పద్ధతి కాదు అన్నారు. అ కళాశాలలకు ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు డబ్బులకు లొంగి కళాశాలలపై చర్యలు తీసుకోవడం లేదు కాబట్టి హైదరాబాదు నగరంలో ప్రతి ఒక్క కాలేజీ నడుస్తూ ఉంది కాబట్టి వెంటనే అ కళాశాలలో పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఇంటర్మీడియట్ బోర్డు ముట్టడి చేస్తామని హెచ్చరించారు.



# తొలి తెలంగాణ వార్షిక విత్తనోత్సవం

- వ్యవసాయంలో సమూల మార్పులతోనే నిజమైన హరిత విప్లవం
- పర్యావరణవేత్త ప్రొ. పురుషోత్తమ్ రెడ్డి

విశాలభారతి,హైదరాబాద్: తొలి తెలంగాణ వార్షిక విత్తనోత్సవం స్థానిక విత్తనమే కేంద్రంగా, రైతే లక్ష్యంగా వ్యవసాయంలో వచ్చే సమూల మార్పులతోనే నిజమైన హరిత విప్లవం సాధ్యమని ప్రముఖ పర్యావరణవేత్త ప్రొ. పురుషోత్తమ్ రెడ్డి పేర్కొన్నారు. ఇకపై ఆ హరిత విప్లవమే మనందరికీ రక్ష అని, విత్తనాన్ని సంకరం చేసివ్యవసాయాన్ని రసాయనమయం చేసిన ప్రక్రియ 'హరిత విప్లవం' కాదని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ తొలి 'విత్తనాల పండుగ'ను శుక్రవారం ప్రారంభించి ఆయన ప్రసంగించానారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్‌సీజీఆర్, భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ మూడు రోజుల పండుగ కడ్తాల్ మండలం, అన్మాస్ పల్లిలో ఈ పండుగ మొదలయింది.కర్ణాటక,రాజస్థాన్, తమిళనాడు,కేరళ తదితర రాష్ట్రాల విత్తనాల నిపుణులు, ఆర్గానిక్ సంస్థలతో 52 స్టాల్స్ తో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. విత్తనాలు బ్యాంక్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని సంస్థ నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్. అన్వేష్ రెడ్డి సుంకెటి మాట్లాడుతూ సంప్రదాయ విత్తనాలు గ్రామ స్థాయిలో అవగాహనతో విస్తృత పరచాలన్నారు. ఉమ్మడి జిల్లా కేంద్రలల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే సహకారం అందిస్తామని తెలిపారు. ఐఏఎస్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డబ్ల్యూ రాంపుల్లా రెడ్డి, ఎమినెంట్ సీడ్ కన్జర్వేటర్ (పద్మశ్రీ )రైమతి ఘురియా ఒడిశా,భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ జాకబ్ నెల్లితాన్, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్. డా.డి.రాజి రెడ్డి, పబ్లిక్ పాలసీ నిపుణులు డా.దొంతి నరసింహా రెడ్డి,CGR అధ్యక్షులు కె.లీలా లక్ష్మా రెడ్డి,CGR వ్యవస్థాపకులు కె. లక్ష్మా రెడ్డి , రైతులు,విద్యార్థులు, ప్రొఫెసర్లు, మేధావులు, సైంటిస్టులు,డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు





## శిల్పి ఎవరో.. ఈ శిల్పం వెనుక!

"ఏఐ కూడా ఊహించలేదుగా ఇంతందాన్ని ఏం చెప్పినా.. యామ్ ఐ ఫాలింగ్ ఇన్ టూ ద లవ్ అని స్టేటస్ పెట్టనా" అంటూ తన జీవితంలోని ఇద్దరమ్మాయిల కోసం ప్రేమ రాగాలు ఆలపిస్తున్నారు హీరో శ్రీవిష్ణు. మరి వాళ్లలో ఆయన్ని ప్రేమలో పడేసిన ఆ సుందరి ఎవరు? ఈ ప్రేమకథ ఎలా సాగింది? తెలియాలంటే 'సింగిల్' చూడాల్సిందే. శ్రీవిష్ణు, కేతిక శర్మ, ఇవానా నాయకానాయికలుగా నటించిన ఈ చిత్రాన్ని కార్తీక్ రాజు తెరకెక్కించారు. అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా మే 9న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఈ చిత్ర తొలి గీతాన్ని విడుదల చేశారు. "శిల్పి ఎవరో.. ఈ శిల్పం వెనుక.. తెలుపు చిరునామా.. నే సెల్ఫి దిగుతా" అంటూ సాగిన ఈ పాటకు విశాల్ చంద్రశేఖర్ స్వరాలు సమకూర్చగా.. శ్రీమణి సాహిత్యమందించారు. యాజిన్ నిజార్ ఆలపించారు. "కొత్తదనం నిండిన వినోదాత్మక ప్రేమకథతో రూపొందిన చిత్రమిది. యువతకు బాగా నచ్చేలా ఉంటుంది. శ్రీవిష్ణు, ఇవానా, కేతిక శర్మల కెమిస్ట్రీ ఆకర్షణగా నిలుస్తుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

## 'కూలీ' విడుదల ఖరారు

'కూలీ' చిత్రంతో సినీప్రియుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు రజనీకాంత్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని లోకేశ్ కనగరాజ్ తెరకెక్కిస్తున్నారు. కళానిధి మారన్ నిర్మాత. నాగార్జున, ఆమిర్‌ఖాన్, ఉపేంద్ర, శ్రుతిహాసన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం శుక్రవారం ప్రకటించింది. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను నెట్టింట పంచుకుంది. అందులో రజనీ మాస్‌లుక్‌లో విజిల్ వేస్తూ కనిపించారు. బంగారం స్మగ్లింగ్ అంశంతో ముడిపడి ఉన్న యాక్షన్ థ్రిల్లర్ ఇది. రజనీ మునుపెన్నడూ చేయని శక్తిమంతమైన పాత్రలో కనువిందు చేయనున్నారు. ఇందులో పూజా హెగ్డే ఓ ప్రత్యేక గీతంలో ఆడిపాడింది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.



## 'తుంబాడ్' దర్శకుడితో శ్రద్ధ?

గతేడాది 'స్త్రీ 2' చిత్రంతో బాలీవుడ్ బాక్సాఫీసు వద్ద రికార్డు సృష్టించింది కథానాయిక శ్రద్ధా కపూర్. ఈ సినిమా విజయంతో ప్రస్తుతం ఆమెకు అవకాశాలు వరుస కడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే శ్రద్ధ మరో హారర్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. 'తుంబాడ్'తో మంచి గుర్తింపు తెచ్చుకున్న రాహి అనిల్ బార్వే తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. "కొన్ని రోజులుగా శ్రద్ధ నిర్మాత ఏక్తాకపూర్‌తో తన రాబోయే చిత్రం కోసం చర్చలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే అనిల్ బార్వే చెప్పిన కథకు పచ్చజెండా ఊపిందామె. ఇంకా పేరు ఖరారు కానీ ఈ చిత్రాన్ని 'స్త్రీ' చిత్రాల కన్నా భారీ స్థాయిలో తీర్చిదిద్దుతున్నారు. ఈ ఏడాది ద్వితీయార్థంలో దీన్ని పట్టాలెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నార"ని శ్రద్ధ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.